ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



శనివారం | 18-07- 2026 | సంపుటి: 17, సంచిక: 105, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆




రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'

# మహా భరోసా

**8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు సంపూర్ణ నగదు రహిత వైద్యం**

**సీజీహెచ్ఎస్ ప్యాకేజీల కింద 1,816 రకాల చికిత్సలు**

**గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ. 10 వేల కోట్ల బిల్లుల చెల్లిస్తోన్నాము**

**సచివాలయంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

హైదరాబాద్, జూలై 17 (ప్రజాకలం) :

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక భరోసా, నమ్మకం కలిగిస్తూ, ఎలాంటి భయాందోళనలు లేని ఒక చక్కటి ఆరోగ్య భద్రత వ్యవస్థను అందించాలనే సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం లి'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'లిను ప్రవేశపెట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైతే వైద్య ఖర్చుల కోసం అప్పులపాలై, వాటిని తీర్చలేక సతమతమవుతున్న దుస్థితిని మేము గమనించాం. ఈ పరిస్థితిని మార్చి, వారికి సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మాతో కలిసి 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను ప్రారంభించి ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేశారు.

తరువాయి 2వ పేజీలో...

ధరణి లావాదేవీలపై

# విచారణకు 'సిట్'

## రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులపై మంత్రిమండలి ఆందోళన



**కేంద్రానికి నివేదిక.. ప్రత్యేక బృందం పంపాలని విజ్ఞప్తి**

**తాగునీరు, విద్యుత్‌పై ముందస్తు కార్యాచరణకు అధికారులకు ఆదేశాలు**

**రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచన**

హైదరాబాద్, జూలై 17 (ప్రజాకలం) :

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన 36వ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పలు కీలక నిర్ణయాలను మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర పరిస్థితులపై పూర్తి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి, వర్షాభావాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక కేంద్ర బృందాన్ని పంపాలని, ప్రత్యామ్నాయ ప్రణాళికల అమలుకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించింది. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతంతో పోలిస్తే కేవలం 30 నుంచి 35 శాతం మాత్రమే వర్షాలు కురిసినట్లు మంత్రిమండలి గుర్తించింది. ఈ పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరాపై అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. అలాగే విద్యుత్ కోతలు లేకుండా నిరంతర సరఫరా కొనసాగించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు సకాలంలో సమాచారం, సలహాలు అందించేందుకు ప్రజాభవన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసే ఈ హెల్ప్‌లైన్ నంబర్ 1-800-123-7157గా నిర్ణయించారు. రైతులు అవసరమైన సూచనలు, సలహాల కోసం ఈ నంబర్‌ను వినియోగించుకోవాలని ప్రభుత్వం కోరింది. తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

తరువాయి 2వ పేజీలో...



2

వలస డ్రైవర్లను మాజీ సైనికులతో

## భర్తీ చేస్తాం

- ట్రంప్ కొత్త ప్రతిపాదన
- వలసదారుల్లో మళ్లీ టెన్షన్

హైడ్రోజన్ రైలు..

# సరికొత్త విప్లవానికి నాంది

**హైడ్రోజన్ రైలుతో హర్యానా పేరు చిరిస్థాయిలో...**

**రైల్వే రూపురేఖలు మార్చడంలో కీలకమైన అడుగు**

**భవిష్యత్తులో మరిన్ని హైడ్రోజన్ రైళ్లు**

**హైడ్రోజన్ రైలు.. రైల్వే ట్రాక్ పై సరికొత్త విప్లవం**



హర్యానా: దేశంలో తొలి హైడ్రోజన్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం జింద్‌లో ప్రారంభించారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ... రైల్వేలో డీజిల్, విద్యుత్ వినియోగం తగ్గిస్తామని వెల్లడించారు. భవిష్యత్తు అంతా హైడ్రోజన్ దేనని ప్రధాని స్పష్టం చేశారు. పర్యావరణ హిత ప్రాధాన్యంలో భాగంగానే హైడ్రోజన్ రైలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సూచించారు. హైడ్రోజన్ రైలుతో హరియాణా పేరు చిరస్థాయిలో నిలుస్తోందని తెలిపారు. రైల్వే రూపురేఖలు మార్చడంలో ఇది కీలకమైన అడుగు అన్నారు.

**హైడ్రోజన్ రైలు హార్స్ పవర్ ఏ3,200**

రూ. 14 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని సూచించారు. హైడ్రోజన్ రైలు.. జింద్-సోనిపత్ మధ్య 89 కిలో మీటర్ల దూరం నడుస్తోందని వివరించారు. దేశ ప్రజలంతా స్వచ్ఛతా మంత్రం పఠిద్దామని ప్రధాని పిలుపునిచ్చారు.

తరువాయి 2వ పేజీలో...



7

నీట్-2026 ఫలితాల్లో మరోసారి అగ్రగామిగా

## రెసో మెడికాన్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

## కలం కౌంటర్




న్యాయవాదుల సంక్షేమానికి

## తెలంగాణ భేష్

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు



ఢిల్లీ: న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.100 కోట్లతో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యాయవాదుల సంక్షేమ పథకాల వివరాలను సీజేఐ ధర్మాసనానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వివరించారు.

తరువాయి 2వ పేజీలో...

15వ ఆర్థిక సంఘం నిధులను

# మళ్లించడం దుర్మార్గం

**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం**

**- చెరువును సందర్శించేలా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా**



సిరిసిల్ల, జులై 17,(ప్రజాకలం) :

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని, గ్రామాల అభివృద్ధి పనుల కోసం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలకు మళ్లించడం దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణంలో జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, ఎస్పీ మహేశ్ బి.గీతే, బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపీ, స్థానిక బీజేపీ నేతలతో కలిసి అమృత్ 2 స్కీమ్ కింద

తరువాయి 2వ పేజీలో...


వరంగల్‌లో BiPC-NEET విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళాశాల

RESO MEDICON
DOCTORS ACADEMY | JUNIOR COLLEGE
NEET UG - 2026 TOPPERS

655/720 K. SYAMKARAN App.No.260410321709
630/720 P. GURURAJ REDDY App.No.260410427973

NEET-2027 LONG TERM ADMISSIONS ARE IN PROGRESS

591 Marks B. KOMAL App.No. 260410487173
580 Marks B. ABHISHEK App.No. 260410168368
546 Marks CH. SAKSHI App.No. 260410877926
528 Marks MD. ADNAN App.No. 260410439933
528 Marks N. MANIDEEP App.No. 260410071614
500 Marks V. JASHWIN TEJ App.No. 260410399249
494 Marks CHETHAN AGARWAL App.No. 260410169959
494 Marks G. VAISHNAVI App.No. 260410912914
485 Marks G. SRI AKSHITHA App.No. 260410314253
481 Marks G. SREEJA App.No. 260410406317
478 Marks K. JYOTHIRMAI App.No. 260410264338
470 Marks D. SANJANA App.No. 260410251619
468 Marks MIDHAT UL HARMAN App.No. 260410312096
465 Marks D. VIKRAM App.No. 260410412305
461 Marks AZMATHUNNISA App.No. 260410277378
460 Marks M. NITHYA App.No. 260410781063
459 Marks CH. SRINIDHI App.No. 260410422608
459 Marks V. NIKHITHA App.No. 260410642243
453 Marks CH. YOGISHWAR App.No. 260410649420
449 Marks G. RISHIKESH App.No. 260410253823
448 Marks B.NAGA SHIVAKUMAR App.No. 260410468712
445 Marks MD. ABDUL ZAYD App.No. 260410121473
442 Marks CH. SAI SPURTHI App.No. 260410990194
442 Marks G. PRANATHI App.No. 260410169238
442 Marks D. SNITHIKA App.No. 260410022600
434 Marks K. SAI SANTHOSHI App.No. 260410029647
431 Marks G. ASHWINI App.No. 260410401393
431 Marks A. CHETHAN App.No. 260410760515
430 Marks D. SONA App.No. 260410851934
426 Marks LAXMI KUMARI App.No. 260410007622
421 Marks M. POOJASRI App.No. 260410179990
420 Marks P. VIRAT REDDY App.No. 260410760515
416 Marks D. NAMRATHA App.No. 260410278211
414 Marks M. SREEJA App.No. 260410913909
409 Marks G. SPOORTHI App.No. 260410336190
403 Marks CH. BHUVANESHWARI App.No. 260410390947

Opp: DIG Bungalow, Adalath, Hanumakonda.
Ph: 9154201130, 9154201134

# ధరణి లావాదేవీలపై విచారణకు 'సిట్'

మొదటి పేజీ తరువాయి...

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని విజ్ఞప్తి చేసింది. వర్షాభావంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, రైతు సమావేశాలు నిర్వహించాలని కూడా నిర్ణయించింది. ఈ నెల 20 నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జి మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, నిపుణులతో సమావేశాలు నిర్వహించి జిల్లా వారీగా వర్షాభావ పరిస్థితులు, పంటల నష్టం, తాగునీటి సమస్యలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి నేతృత్వంలో వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఎల్‌నినో ప్రభావంపై సమగ్ర అధ్యయన నివేదిక రూపొందించాలని నిర్ణయించింది. ఇదే సమావేశంలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, భూముల రికార్డుల మార్పులు, రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ, అసైన్డ్ భూముల బదలాయింపులు తదితర అంశాలపై సమగ్ర విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందంఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. 2020 అక్టోబర్ 29న ధరణి అమల్లోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని అనుమానాస్పద లావాదేవీలను క్షుణ్ణంగా విచారించాలని నిర్ణయించింది. టెండర్ ప్రక్రియ నుంచి ఇటీవల వెలుగులోకి వచ్చిన ఆరోపణల వరకు అన్ని అంశాలు విచారణ పరిధిలోకి వస్తాయని వెల్లడించింది. సామాజిక సమానత్వానికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లను కో-ఆప్టెడ్ సభ్యులుగా నామినేట్ చేసేందుకు తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం-2019లో సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే గ్రామ పంచాయతీ నిధులను జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో జమ చేసుకునేలా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో సవరణకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 36వ మంత్రిమండలి సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియా సమావేశంలో ఈ నిర్ణయాలను వెల్లడించారు. ప్రభుత్వం వర్షాభావ పరిస్థితులను అత్యంత ప్రాధాన్యంగా పరిగణిస్తూ అన్ని శాఖలను అప్రమత్తం చేసిందని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు వారు స్పష్టం చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' మహా భరోసా

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధికి ఈ పథకమే నిదర్శనమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం.. మానవీయ కోణంతో ఆలోచించి ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఉద్ఘాటించారు. "ఉద్యోగులు కూడా మన కుటుంబ సభ్యులేనని, వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత మన ప్రభుత్వంపై ఉందనే సదుద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని, ఉప ముఖ్యమంత్రి హోదాలో నేను ఈ క్యాబినెట్ సబ్ కమిటీకి ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకోగా, నా సహచర మంత్రులు శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గారు, శ్రీ పొన్నం ప్రభాకర్ గారు, శ్రీమతి సీతక్క గారు సభ్యులుగా వ్యవహరించారు. మేమందరం ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, పకడ్బందీ విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నాం. దాని ప్రతిరూపమే ఈ 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'" అని వివరించారు. సుమారు 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వారిపై ఆధారపడిన 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 886 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఉద్యోగులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఉచిత ఇన్‌పేషెంట్ వైద్య సేవలు పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (జ+నూ) ప్యాకేజీ రేట్లకు అనుగుణంగా 1,816 రకాల వైద్య, శస్త్రచికిత్సలను ఈ పథకం కవర్ చేస్తుందని వివరించారు. ఈ పథకం పారదర్శకంగా, సజావుగా సాగేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమాన భాగస్వామ్యంతో ఒక ప్రత్యేక 'ట్రస్ట్' ను ఏర్పాటు చేశామన్నారు.

**గత పాలకుల నిర్లక్ష్యం - మా ప్రభుత్వ చిత్తశుద్ధి**

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు తమ ఆరోగ్య భద్రత కోసం సకల జనుల సమ్మెతో సహా ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. పదేళ్ల పాటు ఉద్యోగుల విజ్ఞప్తులను బుట్టదాఖలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన దాదాపు రూ. 10 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం మానవీయ కోణంలో క్లియర్ చేస్తోందన్నారు. "ఆసుపత్రి పాలై అప్పులపాలైన ఉద్యోగి కళ్లల్లో ఆందోళన ఉంటే ప్రభుత్వానికి సరైన ఔట్‌పుట్ ఇవ్వలేడు. అందుకే నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులను నెలకు రూ.2000 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తున్నాం. ప్రతి 15 రోజులకోసారి నేనే (భట్టి విక్రమార్క) స్వయంగా సమీక్షిస్తూ ఒక్క రూపాయి కూడా పెండింగ్ లేకుండా చూస్తున్నాను," అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతతో రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు భట్టి తెలిపారు.

అందులో భాగంగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని, అర్హులైన 1.06 కోట్ల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం ఇంతటి చిత్తశుద్ధితో పనిచేస్తున్న నేపథ్యంలో, ప్రతి ఉద్యోగి రెట్టింపు ఉత్సాహంతో, నిబద్ధతతో పనిచేయాలని డిప్యూటీ సీఎం కోరారు. పేదలకు సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఉచిత విద్యుత్, గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు చేర్చడంలో ఉద్యోగులే నిజమైన వారధులుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరి డా. క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఎడ్యూకేషన్ సెక్రటరి యోగిత రాణా, స్పెషల్ ఛీఫ్ సెక్రటరి జీఏడి బెన్ హర్ మహేష్ దత్ ఎక్కా, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరి సందీప్ కుమార్ సుల్తానియా, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రోజన్ రైలు.. సరికొత్త విప్లవానికి నాంది

మొదటి పేజీ తరువాయి...

భవిష్యత్తులో మరిన్ని హైడ్రోజన్ రైళ్లు అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు. హైడ్రోజన్ రైలు.. రైల్వే ట్రాక్ పై సరికొత్త విప్లవానికి నాంది అని ప్రధాని పేర్కొన్నారు. జింద్-సోనిపత్ మధ్య నడిచే హైడ్రోజన్ రైలు 3,200 హార్స్ పవర్ తో నడుస్తోందని వెల్లడించారు. జింద్-సోనిపత్ హైడ్రోజన్ రైలు 10 కోచ్ లతో నడుస్తోందన్నారు.

**ఎలాంటి సంక్షోభాలు వచ్చినా భారత్ అడుగులు అభివృద్ధి వైపే**

మిగతా దేశాల హైడ్రోజన్ రైళ్ల కంటే ఈ రైలుకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయని ప్రధాని వివరించారు. గత 12 ఏళ్లలో మన రైల్వేలో కీలక మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. కొన్ని నెలలుగా పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్న నరేంద్ర మోదీ చమురు సరఫరా కీలక మార్గంలో అనిశ్చితి నెలకుందని సూచించారు. హర్మూజ్ జలసంధి మార్గంలో దాడులు, ప్రతి దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే కొన్ని మార్గాల్లో మనకు డీజిల్ తో నడిచే రైళ్లు ఉన్నాయని చెప్పారు. 2014 వరకు రైల్వేలో విద్యుదీకరణ 30 మాత్రమే ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 12 ఏళ్లలో రైల్వేలో విద్యుదీకరణ 99 శాతానికి పెంచామని వివరించారు. ఎలాంటి సంక్షోభాలు వచ్చినా భారత్ అడుగులు అభివృద్ధి వైపేనన్న ప్రధాని తాము ఏం చేసిన ముందుచూపుతోనే పనిచేస్తామని స్పష్టం చేశారు.

**భారత్ లో ఒలింపిక్స్ జరిగే సమయం ఎంతో దూరం లేదు**

ప్రధాని మోదీ దృష్టి ఎప్పుడూ సమస్యల పరిష్కారంపైనే ఉందని చెప్పారు. భారత్ లో ఒలింపిక్స్ జరిగే సమయం ఎంతో దూరం లేదన్నారు. ఒలింపిక్స్ పోటీలకు తగినట్లు మన క్రీడాకారులను తీర్చిదిద్దుతామని ఆయన వ్యాఖ్యానించారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులను

# మళ్లించడం దుర్మార్గం

మొదటి పేజీ తరువాయి...

రూ.1.32 కోట్ల నిధులతో చేపట్టిన కార్గిల్ చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. పక్కనే ఉన్న కార్గిల్ యుద్ధ శకటాన్ని సందర్శించి, కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. కార్గిల్ చెరువు పునరుద్ధరణ చేసి మురుగునీరు రాకుండా సుందరీకారంగా తీర్చిదిద్ది జిల్లా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ చెరువును సందర్శించేలా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతమన్నారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు రాష్ట్రమంతా కాంట్రాక్ట్ ను పట్టుకుని, ఎక్కడ పూర్తి స్థాయిలో పనులు చేయడం లేదని, ఇతర కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వకుండా సిండికేట్ లా మారి ఇబ్బందులు పెడుతున్నారని, ఇకపై అలా జరగకుండా చూస్తామని అన్నారు. అమృత్ స్కిమ్ను గొప్ప ఆశయంతో ప్రధానమంత్రి మోదీ ప్రారంభించారన్నారు. అమృత్ 1 మిషన్ కింద రూ.77 వేల 640 కోట్ల వ్యయం అంచనా వేస్తే కేంద్రం 35 వేల 990 కోట్లు కేటాయించింది. 2021 నాటికి అమృత్ 1 స్కీం పూర్తయ్యిందని, 2021 అక్టోబర్ లో అమృత్ 2 స్కీం పేరుతో 2 లక్షల 99 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తే, అందులో కేంద్రం తన వాటాగా 76 వేల 760 కోట్లు కేటాయించిందన్నారు. అమృత్ 1 కింద తెలంగాణకు 1660 కోట్లు, అమృత్ 2 కింద 3వేల 429 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించిందని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు సిరిసిల్ల, వేములవాడ, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీలు అమృత్ పథకం కింద దాదాపు 400 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. తెలంగాణకు 12 ఏళ్లలో 13 లక్షల కోట్ల రూపాయలను కేంద్రం ఖర్చు చేసిందని, అయినా తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వచ్చి అబద్ధాలాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా నయాపైసా కూడా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు ఇవ్వడం లేదని, సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నయాపైసా ఇవ్వలేదన్నారు. అమృత్ స్కీం కింద కేంద్రం గ్రామాల అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులిస్తే... వాటిని అభివృద్ధి పనులకు కాకుండా కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతాల కోసం ఖర్చు చేస్తూ నిధులు డైవర్ట్ బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను ఆ లక్ష్యానికే ఉపయోగించాలని, నిధులను దారి మళ్లిస్తే ఊరుకునేది లేదని, ప్రభుత్వం తీరు మారకుండా కేంద్రానికి తాను లేఖ రాస్తే నిధులు ఆగిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. అదే సమయంలో కేంద్ర నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం సిబ్బంది జీతభత్యాలు, కరెంట్ బిల్లులకు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉండడం బాధాకరమన్నారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ భేష్

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కెనరా బ్యాంకులో రూ.100 కోట్ల శాశ్వత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపింది. అలాగే 2022 నుంచి 2026 వరకు న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌కు అదనంగా రూ.7 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది న్యాయవాదుల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించింది. ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం అందిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. అలాగే ప్రమాదవశాత్తు న్యాయవాది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, దేశంలో న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా, మహిళా న్యాయవాదులకు కోర్టుల్లో కనీస సదుపాయాలు కల్పించే అంశంపై సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని అడ్వకేట్ జనరల్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన మౌలిక వసతులపై వివరాలు సేకరించాలని సూచించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నంబర్ 770/2026 విచారణ సందర్భంగా తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి బి.పాపిరెడ్డి ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల వైద్య అత్యవసరాలు, కుటుంబ భద్రత, ఆర్థిక సహాయానికి తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తోందని అఫిడవిట్‌లో ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయనీ వెల్లడించింది.

# వలస డ్రైవర్లను మాజీ సైనికులతో భర్తీ చేస్తాం

## - ట్రంప్ కొత్త ప్రతిపాదన - వలసదారుల్లో మళ్లీ టెన్షన్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. దేశంలోకి అక్రమంగా వలస వచ్చి ట్రక్ డ్రైవర్లుగా మారిన వారిని తప్పించి ఆ బాధ్యతలను మాజీ సైనికులకు అప్పగించే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. దేశంలోకి వలస వచ్చిన అనేక మంది డ్రైవర్లు మద్యం, డ్రగ్స్ మత్తులో తూగుతూ అనేక మంది మరణాలకు కారణమవుతున్నారని ఆరోపించారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే అమెరికాలోని వేల మంది వలసదార్లు చిక్కుల్లో పడే ప్రమాదం ఉందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. 'త్వరలో మా ప్రభుత్వం ఓ చరిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతోంది. దేశంలో అక్రమంగా ఉంటూ అనేక మంది ట్రక్ డ్రైవర్లపై చర్యలు తీసుకోబోతు న్నాం. వీళ్లల్లో చాలా మంది మద్యం, డ్రగ్స్ మత్తులో తూగుతుంటారు. రోడ్డుపై ఉన్న ట్రాఫిక్ బోర్డులను కూడా వీరు చదవలేరు. వీళ్లు మనకు అవసరం లేదు. కానీ మన రోడ్లపై వీళ్లు ట్రక్‌లతో దూసుకెళుతున్నారు. వీళ్ల స్థానాన్ని మాజీ అమెరికా సైనికులతో భర్తీ చేస్తాము. ఈ దిశగా మాజీ సైనికు లకు శిక్షణ ఇస్తాము. ట్రక్ డ్రైవింగ్ నేర్పిస్తాము' అని ట్రంప్ పేర్కొన్నట్టు అంతర్జాతీయ మీడియా లో కథనాలు వెలువడ్డాయి. అమెరికా మిలిటరీ కోసం ట్రక్స్ నడిపిన డ్రైవర్లు అందరూ ఆటోమే టిక్‌గా కమర్షియల్ డ్రైవర్ లైసెన్స్‌కు అర్హత పొం దుతారని కూడా ట్రంప్ చెప్పారు. అమెరికాలో ఇటీవల ట్రక్ డ్రైవింగ్ ఉద్యోగాలపై వలసదారుల్లో ఆసక్తి పెరిగినట్టు తెలుస్తోంది. ఈ రంగంలో అమెరికన్లు తక్కువగా ఉండటంతో పాటు యూఎ స్‌కు రాగానే మంచి ఆదాయం కళ్ల చూసే అవకాశం ఉండటంతో అనేక మంది ట్రక్ డ్రైవర్లుగా మారుతున్నట్టు తెలుస్తోంది. అయితే, అక్రమవలసదారులపై ట్రంప్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండటంతో మార్చిలో వేలసంఖ్యలో విదేశీ ట్రక్ డ్రైవర్లు తమ కమర్షియల్ లైసెన్సులు కోల్పోయారు.

# తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో నూతన శకానికి నాంది

## 70 ఏళ్ళ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ - ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగని రీతిలో దేవాదాయ శాఖలో ఉద్యోగుల నియామకం

**పురోహితులు, పరిచారకులు, వేదపండితులు, పురోహితులు (వాహన పూజ), అసిస్టెంట్ కుక్ లు, డోలు, సన్నాయి, మృదంగం, శృతి, తాళం తదితర విభాగాల్లో మొత్తం 191 మందికి నియామక ఉత్తర్వులు**

**పలువురు ఉద్యోగులకు స్వయంగా నియామక పత్రాలు అందించిన దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు మంత్రి కొండా సురేఖ**

హైదరాబాద్, జూలై 17 (ప్రజాకలం) :

దేవాలయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి, ధర్మ పరిరక్షణకు కేంద్రంగా నిలిచే పవిత్ర క్షేత్రమని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ అన్నారు. అలాంటి దేవాలయాల వైభవాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వర్తించే అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, దేవాలయ వంట సిబ్బంది సేవలు అత్యంత పవిత్రమైనవని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదని మంత్రి సురేఖ అన్నారు. హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన 191 మంది మతపరమైన ఉద్యోగుల నియామక ఉత్తర్వుల అందజేత కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన పలువురికి తన చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. వీరిలో రాష్ట్రవ్యాప్తంగా 47 ఆలయాలకు ఎంపికైన అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, మృదంగం, డోలు, సన్నాయి, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులున్నారు. 191 మంది ఉద్యోగుల నియామకం చేపట్టడం తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంత రావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, స్టేట్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ డైరక్టర్ విజయ రాఘవాచార్యులు, దేవాదాయశాఖ ఆర్జెసి రామకృష్ణారావు, డిసి కృష్ణప్రసాద్, ఎడిసి లు శ్రీనివాస్, జ్యోతి, ఎసి రామాల సునీత, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, డాక్టర్ ఆర్. శ్రీరామ ఘనాపాటి, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఆలయాల్లో ఖాళీగా ఉన్న మతపరమైన పోస్టులను భర్తీ చేయడం ద్వారా నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని స్పష్టం చేశారు. వీరిలో వారి వారి పరిధిలో నిర్వర్తించే బాధ్యతలు దేవాలయాల ఆధ్యాత్మిక వైభవాన్ని, పరిపాలనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అర్చకుల దేవతారాధన, వేదపండితుల వేద పారాయణం, పరిచారకుల నిత్య కైంకర్య సేవలు, ఆధ్యాత్మికశోభను పెంపొందించే మృదంగ వాయిద్య కళాకారులు, దైవానికి నైవేద్యం, భక్తులకు ప్రసాదాన్ని సిద్ధంచేసే వంటవారు తదితర ఉద్యోగులంతా నిష్ఠతో వుంటేనే దేవాలయాల వైభవం, పవిత్రత, ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని మంత్రి సురేఖ పేర్కొన్నారు. "దేవాలయ ఉద్యోగమంటే ఉపాధి లేదా ఉద్యోగంగా భావించకుండా భగవంతుని సేవ చేసే అరుదైన అవకాశం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే గొప్ప బాధ్యత అని మీరు భావించాలి. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తించి భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలి" అని మంత్రి సురేఖ నియామక ఉత్తర్వులందుకున్న ఉద్యోగులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ శాఖను మరింత బలోపేతం చేస్తూ ఆలయాల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, ఆగమ సంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. దేవాదాయ శాఖ అధికారుల సమిష్టి కృషితోనే దేవాదాయ శాఖ చరిత్రలోనే ఎన్నడూ చేపట్టని విధంగా 191 మంది మతపరమైన ఉద్యోగుల నియామకాన్ని అత్యంత పారదర్శకంగా చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా దేవాలయాలకు ప్రత్యేకంగా భావించే రోజుల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు చెప్పే విధంగా త్వరలో ఉత్తర్వులిస్తామని మంత్రి సురేఖ ప్రకటించారు. త్వరలో ఆయా గుళ్ళలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగస్తులకు పనితీరును బట్టి అవార్డులు ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో ఇప్పటికే సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించిందని, రాబోయే రోజులు గోదావరి, కృష్ణ నదీ పుష్కరాలను అదే స్థాయిలో నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. గిరిజన జాతరగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికే ఏళ్ళుగా పెండింగ్ లో వున్న గ్రేడ్ 1, గ్రేడ్ 2 ఈవోల ప్రమోషన్స్ చేపట్టామని, త్వరలో గ్రేడ్ 3 ఈవోల ప్రమోషన్ ను చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వరుణయాగం నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ యాగాల ద్వారా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయా దేవాలయాల్లో పూజలు చేయాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ గారిని దేవాదాయ ఉద్యోగులు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగారి చేతులు మీదుగా నియామక పత్రాలు పొందిన ఉద్యోగులు మాట్లాడుతూ మంత్రి సురేఖ గారి చొరవతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తమకు దేవుడి సన్నిధిలో పనిచేసే అవకాశం దక్కడంపై వారంతా సంతోషాన్ని తెలుపుతూ భావోద్వేగానికి లోనయ్యారు.



## బొగ్గు, బూడిద కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ విద్యుత్ ఉద్యోగుల నిరసన



గొల్లపల్లి జూలై 17 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి సబ్ డివిజన్ పరిధిలో తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లోని బొగ్గు , బూడిద విభాగాల నిర్వహణను ప్రైవేట్‌కు కట్టబెట్టే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్రైవేటీకరణ నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ జెఏసి నాయకులు మాట్లాడుతూ, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరిస్తే ఉద్యోగుల భద్రతకు ముప్పు ఏర్పడటమే కాకుండా, రైతులు, సామాన్య ప్రజలు, చిన్న పరిశ్రమలపై తీవ్ర ఆర్థిక భారం పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ రంగంలో ప్రజల సొమ్ముతో నిర్మించిన విద్యుత్ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు చేపట్టడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు నిరసనలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వరుణ్ కుమార్, ప్రసాద్, వెంకట రమణ, రవి శంకర్, ప్రకాష్, ట్రాన్స్‌కో ఏడీఈ , ఏఈ , గొల్లపల్లి సబ్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నమోదు శాతం పెంచాలి

### బి.ఎల్.ఓలతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి జూలై 17 (ప్రజాకలం) జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల పరిధిలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం



పురోగతి, నమోదు శాతాలపై శుక్రవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హాజరై బి.ఎల్.ఓలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపించి, వాటిని త్వరితగతిన బి.ఎల్.ఓలకు అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరును నమోదు ప్రక్రియలో భాగస్వామి చేసేలా బి.ఎల్.ఓలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఎస్ఐఆర్ నమోదు శాతం పెంచేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల తహసీల్దార్లు రామ్ మోహన్, హకీమ్, సూపర్వైజర్లు, బి.ఎల్.ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతుల వినూత్న నీటి సంరక్షణ పద్ధతులు

గొల్లపల్లి జూలై 17 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలం కేంద్రంలోని స్థానికి రైతులు ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నీటి సంరక్షణ పద్ధతుల పై, వ్యవసాయ విస్తరణ అధికారి సంధ్య మూడు గ్రామాలలో రైతులు వేసినా పంటలను క్షేత్రస్థాయి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. స్ప్రింక్లర్ వ్యవస్థల అధిక వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొని, రైతులు పెద్ద పరిమాణంలోని పీవీసీ పైపులకు వాల్వులు అమర్చి, లేటరల్ పైపుల ద్వారా పంటలకు నీటిని సమర్థవంతంగా అందించే వినూత్న పద్ధతిని అవలంబిస్తున్న వాటిని గుర్తించారు. ఈ విధానం కాలువల ద్వారా జరిగే నీటి ఆవిరీకరణ నష్టాన్ని తగ్గించడంతో పాటు, తక్కువ ఖర్చుతో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు దోహదపడుతుందని అన్నారు.

## హరిత హారం అటకెక్కినట్టేనా...?

### - కొరవడిన అధికారుల పర్యవేక్షణ
### - మొక్కలు పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం



గొల్లపల్లి జూలై 17 ప్రజాకలం ప్రతినిధి తెలంగాణలో పచ్చదనాన్ని పెంచడానికి గతంలో చేపట్టిన హరిత హారం కార్యక్రమం నేడు అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రాధాన్యత కోల్పోయినట్లు కనిపిస్తుంది. అధికార యంత్రాంగం పర్యవేక్షణ కొరత కారణంగా హరిత హారం అటకెక్కినట్టే కనిపిస్తుంది. పర్యావరణం పరిరక్షణలో భాగంగా ప్రజలకు ప్రభుత్వాలు అధికారులు ప్రతి సంవత్సరం మొక్కల పెంపకం,అడవుల సంరక్షణ ,అటవీ సంపద కాపాడుట పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు . హరిత హారంలో భాగంగా అటవీ ప్రాంతంలతో పాటు నగరాల్లో ,గ్రామాల్లో రోడ్డు ఇరువైపుల,ఇళ్లలో, ప్రభుత్వ భూముల్లో, ఖాళీ స్థలాలలో మొక్కలను నాటి పెంపొందించే వారు ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఏడాది వర్షాకాలం మొదలు కాగానే మొక్కల పెంపకం, మొక్కలు నాటి వాటి సంరక్షణ చేపట్టి పట్టణాలలో ,గ్రామాలలో ప్రజలకు,రైతులకు ఇప్పటి వరకూ మొక్కల పంపిణీ చేయకపోవడం గమనార్హం. పర్యావరణాన్ని పరిరక్షించి మొక్కలు నాటి అడవులను పరిరక్షించడం వలన వర్షాలు సంవృద్ధిగా కురిసే అవకాశాలు ఎక్కువగా ఉండనున్నాయి. ఇది ఇలా ఉంటే గతంలో హరిత హారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగినా చెట్లను విద్యుత్ లైన్ల కింద పెట్టడం వలన విద్యుత్ సిబ్బంది,భవన నిర్మాణల కోసం ఇష్టానుసారంగా చెట్లను నరికేస్తున్నారు. ఇకనైనా అధికారులు తక్షణమే స్పందించి హరితహారాన్ని గాడిలో పెట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## భర్త హత్య కేసులో భార్యకు యావజ్జీవ కారాగార శిక్ష

### - రూ.10 వేల జరిమానా విధించిన జగిత్యాల జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు

జగిత్యాల ప్రతినిధి జులై 17 (ప్రజా కలం)

కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో జరిగిన భర్త హత్య కేసులో నిందితురాలు బత్తుల ప్రమీల (25)ను దోషిగా నిర్ధారిస్తూ జగిత్యాల ప్రధాన జిల్లా మరియు సెషన్స్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం, 2022 నవంబర్ 11న కొడిమ్యాల గ్రామానికి చెందిన బత్తుల శ్రీను తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో, భార్య బత్తుల ప్రమీల అక్రమ సంబంధం నేపథ్యంలో జరిగిన వివాదంలో అతడిని హత్య చేసింది. అనంతరం సంఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించే ఉద్దేశంతో మృతదేహాన్ని చీరతో ఉరివేసుకున్నట్లు కనిపించేలా ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో తేలింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసును మొదట అప్పటి సీఐ బి. కోటేశ్వర్ దర్యాప్తు చేయగా, అనంతరం సీఐ డి. రమణమూర్తి దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో పటిష్టమైన ఆధారాలు సమర్పించారు. పీపీ రామకృష్ణారావు సాక్షులను కోర్టు ఎదుట ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జగిత్యాల ప్రధాన జిల్లా సెషన్స్ జడ్జి రత్న పద్మావతి శుక్రవారం (జూలై 17, 2026) తీర్పు వెలువరిస్తూ నిందితురాలు బత్తుల ప్రమీలను దోషిగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. ఈ కేసులో నిందితురాలికి శిక్ష పడేలా సమర్థంగా పనిచేసిన పీపీ రామకృష్ణారావు, దర్యాప్తు అధికారులు ఇన్‌స్పెక్టర్లు బి. కోటేశ్వర్, డి. రమణమూర్తి, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ హరీష్, సీఎంఎస్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్‌లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## గ్రామ సభలతో భూముల రీ-సర్వే వేగవంతం చేయాలి

### అదనపు కలెక్టర్ బి.ఎస్. లత - కథలాపూర్ మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం మౌలిక సదుపాయాల తనిఖీ - విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి




జగిత్యాల ప్రతినిధి జూలై 17 (ప్రజాకలం)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని గ్రామ సభల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కథలాపూర్, కోరుట్ల మండలాల్లోని నాగమల్లప్పకుంట, ధర్మారం గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వే అవగాహన గ్రామ సభల్లో బీఎస్ లత పాల్గొన్నారు. అనంతరం కథలాపూర్ మండలంలోని మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, తాగునీరు, పారిశుద్ధ్యం, వంటశాల, భోజనశాల తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల ప్రకారం భూముల రీ-సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు, సరిహద్దులు, రికార్డులను పరిశీలించి సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. గ్రామ సభల ద్వారా భూ యజమానుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు రీ-సర్వేపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్నామని తెలిపారు. భూ వివాదాల నివారణకు, ఖచ్చితమైన భూ రికార్డుల నిర్వహణకు ఈ రీ-సర్వే ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మోడల్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమైన అదనపు కలెక్టర్, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని, నిరంతరం నేర్చుకునే తపనతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో కథలాపూర్, కోరుట్ల తహసీల్దార్లు రాజ్ మహ్మద్, కృష్ణ చైతన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వర్షాభావం నేపథ్యంలో పంట మార్పిడి తప్పనిసరి

### - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
### - సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వరికి బదులుగా సరుగుడు, ఆయిల్ పామ్, కూరగాయల సాగుపై దృష్టి - డ్రిప్, మల్చింగ్ సబ్సిడీలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు

జగిత్యాల ప్రతినిధి జూలై 17 (ప్రజాకలం)

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షాభావం, సాగునీటి కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి (క్రాప్ డైవర్సిఫికేషన్) చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంట మార్పిడి కార్యక్రమంలో భాగంగా మేడిపల్లి మండలం పొరుమల్ల గ్రామంలో శుక్రవారం పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 15 టీఎంసీల కంటే తక్కువ నీటి నిల్వలు మాత్రమే ఉన్నందున కాలువల ద్వారా సాగునీరు అందించే పరిస్థితి లేదన్నారు. దీంతో అధిక నీటి అవసరమయ్యే వరి సాగుకు బదులుగా సరుగుడు, ఆయిల్ పామ్, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పొరుమల్ల గ్రామంలో ప్రతి సంవత్సరం సుమారు 1,200 ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా, ఈసారి దాదాపు 200 ఎకరాల్లో సరుగుడు తదితర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అయితే కోత యంత్రాల లభ్యత, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ షీట్లపై సబ్సిడీ కల్పించాలని రైతులు కోరినట్లు తెలిపారు. ప్రస్తుతం డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ పండ్ల తోటలు, ఆయిల్ పామ్, కూరగాయల పంటలకు



మాత్రమే వర్తిస్తోందని, సరుగుడు పంటకు కూడా వర్తింపజేసే అంశాన్ని రాష్ట్ర హార్టికల్చర్ శాఖ దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయనున్న రైతుల వివరాలు, అవసరమైన బడ్జెట్‌పై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో వరి సాగు చేసే రైతుల్లో సుమారు 70 శాతం మంది ఇంకా నాట్లు వేయకుండా వర్షాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్న కలెక్టర్, ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం లేకపోవడంతో నష్టాలు నివారించేందుకు రైతులు ముందస్తుగా పంట మార్పిడి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, తహసీల్దార్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు

### జూలై 20 నుంచి 26 వరకు అవకాశం - ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకయ్య



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 17 (ప్రజా కలం) దోస్త్ స్పెషల్ ఫేజ్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకయ్య విద్యార్థులకు సూచించారు. ఇప్పటి వరకు దోస్త్ ద్వారా డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే వివిధ కళాశాలల్లో సీసీఓటీపీ విధానంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇదే చివరి అవకాశం కావడంతో అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకయ్య కోరారు.

## వరికి ప్రత్యామ్నాయ పంటలు, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

### మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్




ఇబ్రహీంపట్నం జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి )

ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బ గ్రామ పంచాయతీలో రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ అవకాశాలను దృష్టిలో ఉంచుకొని వరికి ప్రత్యామ్నాయ పంటల సాగు మరియు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులుగా కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం వంటి సేంద్రియ పద్ధతులను అవలంబించి నేల సారాన్ని పెంపొందించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు. అమ్మక్కపేట గ్రామ పంచాయతీలో వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్, వేములకుర్తి గ్రామ పంచాయతీలో వ్యవసాయ విస్తరణ అధికారి రవళిక, ఫకీర్ కొండాపూర్ గ్రామ పంచాయతీలో వ్యవసాయ విస్తరణ అధికారి సాగర్ రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలు మరియు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమాలలో అమ్మక్కపేట గ్రామ సర్పంచ్ కాశిరెడ్డి భాస్కర్, వేములకుర్తి గ్రామ సర్పంచ్ తరి రామానుజం, ఫకీర్ కొండాపూర్ గ్రామ సర్పంచ్ తోట రమేష్, లింగంపల్లి గంగాధర్, జీవన్ పుప్పాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### సంక్షేమ పాఠశాలల్లో మెనూను సమర్థవంతంగా అమలు చేయాలి
### జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల ప్రతినిధి జులై 17 (ప్రజాకలం) జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి, భోజనం సమయానికి అందుతున్నదా అనే అంశాలపై ఆరా తీశారు. అలాగే డైట్ మెనూ అమలు, వంటగది పరిశుభ్రత, తాగునీటి వినియోగం, ఆహార పదార్థాల నిల్వ, కిచెన్ షెడ్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి అందించే భోజనం పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా, నాణ్యంగా ఉండాలని సూచించారు. వంటశాలల్లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన పదార్థాలతో ఆహారం సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంక్షేమ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. రాజ్‌కుమార్, జిల్లా విద్యాధికారి కె. రాము, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, తహసీల్దార్, ఎంపీడీవో, మండల విద్యాధికారి, పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కండ్లపెల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్

### - పాఠశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన నాణ్యతపై పరిశీలన



జగిత్యాల ప్రతినిధి జులై 17 (ప్రజాకలం) జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపెల్లి మోడల్ స్కూల్‌ను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ్ గౌడ్ శుక్రవారం సందర్శించి పాఠశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, విద్యా వాతావరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, వంటశాల, భోజనశాల తదితర సౌకర్యాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మమేకమై బోధన విధానం, విద్యాభ్యాసంపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యారంగంలో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తు లక్ష్యాల సాధన కోసం నిరంతరం నేర్చుకునే తపనతో ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, చదువుపై అంకితభావంతో ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజా కలం
శనివారం, జూలై 18, 2026

## అమెరికా యూ టర్న్...

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలనే ప్రతిపాదనలను అమెరికా కాస్త వెనక్కి తగ్గింది. ఇది భారత్, చైనాకు ఊరట కలిగించే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాలో ప్రవేశపెట్టిన రష్యా ఆంక్షల బిల్లును సవరించారు. ప్రతిపాదిత గరిష్ట సుంకాన్ని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఈ బిల్లు చట్టంగా మారితే, భారత్ వంటి ప్రధాన రష్యన్ చమురు దిగుమతిదారులకు మేలు జరగనుంది. ఇప్పటి వరకు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలగవచ్చు. రిపబ్లికన్– డెమొక్రటిక్ చట్టసభ సభ్యులు మంగళవారం రష్యా ఆంక్షల బిల్లు సవరించిన ప్రతిని ప్రవేశపెట్టారు. ఈ కొత్త ముసాయిదా, రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై గరిష్టంగా 100 శాతం సుంకాన్ని విధించాలని ప్రతిపాదిస్తోంది. గతంలో, ఈ బిల్లు అటువంటి అన్ని దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలని కోరింది. అగ్రరాజ్యం అమెరికాకు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక భారత్‌కు మొదలైన కష్టాలు ఇంకా కొనసాగుతున్నాయి. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో భారత్ ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొటోంది. అమెరికా వెళ్లేవారు ఇబ్బంది పడుతన్నారు. ఇక ప్రతీకార సుంకాలు భారత వ్యాపార ఎగుమతులను దెబ్బతీస్తున్నాయి. ఇప్పటికే అనేక కారణాలతో దిగుబతులపై 25 శాతం నుంచి 50 శాతం వరకు సుంకాలు అమలు అవుతున్నాయి. తాజాగా రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపి ట్రంప్ చట్ట సవరణ తీసుకురాబోతున్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసే దేశాలపై విధించాలనుకున్న సుంకాల గరిష్ట పరిమితిని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించారు. ఈ బిల్లు రష్యా నాయకులు, ఆర్థిక సంస్థలు, ఇంధన సంబంధిత ప్రాజెక్టులను నేరుగా లక్ష్యంగా చేసుకుంటుంది. ఈ చట్టం (శాంక్షనింగ్ రష్యా యాక్ట్)ను ఇటీవల మరణించిన సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించారు. దీని ద్వారా అధ్యక్షుడికి రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం లభిస్తుంది. మొదట్లో దీనిని ఆర్థికంగా బలహీనపరిచే శక్తివంతమైన చర్యగా అభివర్ణించారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో సుంకాల పరిమితిని 100 శాతానికి తగ్గించి సవరించారు. ఈ మార్పులకు ప్రభుత్వ, వ్యతిరేక పక్షాల నుంచి మద్దతు లభించింది. గ్రాహమ్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు యుద్ధానికి పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నాయని ఆరోపించారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఆ దేశాలు రష్యా ఇంధనం కొనకుండా అడ్డుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. సవరించిన రూపంలో ఈ నిబంధనలు మిత్రరాజ్యాలకు అనుకూలంగా ఉన్నాయి. లక్ష్యంగా మారే దేశాల్లో చైనా, భారత్, స్లోవేకియా, హంగరీ, అజర్‌బైజాన్ ఉన్నాయి. రష్యా సహజ వాయువును దిగుమతి చేసుకునే ప్రధాన దేశాల్లో చైనా, ఫ్రాన్స్, జపాన్, హంగరీ, బెల్జియం ఉన్నాయి. రష్యా వాయువు ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసి, సరఫరాలను తగ్గించే చర్యలు తీసుకుంటున్న దేశాలకు ఈ బిల్లులో మినహాయింపులు ఇచ్చారు. ఇది జపాన్, ఫ్రాన్స్‌కు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. మధ్యప్రాచ్యంలో సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు అమెరికా రష్యా ఇంధనంపై మినహాయింపులు ఇచ్చింది. ప్రస్తుతం ఆ మినహాయింపులను తొలగించే యోచనలో ఉంది. ట్రంప్ పిచ్చి చేష్టలతో మళ్లీ చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది. రష్యా నుంచి ముడి చమురును అత్యధికంగా కొనుగోలు చేసే దేశాల్లో భారత్, చైనా ఉన్నాయని అమెరికా భావిస్తోంది. సవరించిన బిల్లు ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాలకు మాత్రమే గరిష్ట సుంకాలు వర్తిస్తాయి. గతంలో, ఈ నిబంధన దిగుమతి చేసుకునే అన్ని దేశాలకు వర్తించేది. ఈ బిల్లును దివంగత రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం, డెమొక్రటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతల్ ప్రవేశపెట్టారు. సవరించిన ఈ బిల్లుకు రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. సెనేట్ వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుతం 26 మంది చట్టసభ్యులు ఈ బిల్లుకు సహ–ప్రాయోజకులుగా ఉన్నారు. ఇది కాంగ్రెస్‌లో ముందుకు సాగే కొద్దీ మరింత మద్దతు పొందే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదన ప్రస్తుతం అమెరికా కాంగ్రెస్‌లో పరిశీలనలో ఉంది. కాంగ్రెస్ ఆమోదం, అధ్యక్షుడి అంగీకారం లభించిన తర్వాతే ఇది చట్టంగా మారుతుంది. అందువల్ల, భారత్ సహా ఇతర దేశాలు ఈ బిల్లు పురోగతిని నిశితంగా గమనిస్తున్నాయి.

### కోరుట్లలో ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాల

## త్రిశక్తి మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు

### - అధిక సంఖ్యలో పాల్గొంటున్న భక్తులు..





మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 17 (ప్రజా కలం) కోరుట్ల పట్టణంలోని త్రిశక్తి మాత దేవాలయంలో గణేశ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆషాఢ మాసంలో నిర్వహించే వారాహి నవరాత్రులు జూలై 15 నుంచి 24 వరకు జరగనున్నాయని, జూలై 25న వారాహి మాత నిమజ్జనోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం రాత్రి రెండో రోజు సందర్భంగా వారాహి మాత ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఈ కార్యక్రమానికి కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి దేవిని ఆరాధించడం ద్వారా శత్రు, దుష్టశక్తుల నుంచి రక్షణ లభిస్తుందని, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఆషాఢ మాసంలో జరిగే ఈ ఉత్సవాలను గుప్త నవరాత్రులు అని కూడా పిలుస్తారు. దసరా నవరాత్రులతో పోలిస్తే వీటికి ప్రత్యేకత ఉందని, వారాహి దేవికి ప్రధానంగా రాత్రి వేళల్లో ధూపం, దీపం, నైవేద్యం, అభిషేకం, హోమాది పూజలు నిర్వహించడం ఆనవాయితీ అని ఆలయ నిర్వాహకులు తెలిపారు. గత ఏడాది నుంచి వారాహి నవరాత్రులు నిర్వహిస్తుండగా, ఈ ఏడాది ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు త్రిశక్తి మాత దేవాలయానికి చేరుకుని వారాహి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో ఆర్థిక స్వయంశక్తి

### ఒంటరి మహిళలకు ప్రత్యేక రాయితీలు - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,జూలై17:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగు పై ప్రత్యేక ప్రోత్సాహకం అందిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా నాణ్యమైన మొక్కల సరఫరాతో పాటు అంతర పంటల సాగు,తోట నిర్వహణ కోసం నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం రాయితీలు అందజేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ పంట ద్వారా రైతులు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో పట్టా భూమి కలిగి ఆయిల్ పామ్ సాగు చేయదలచిన ఒంటరి మహిళా రైతులకు ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందించే నాలుగు సంవత్సరాల రాయితీలతో పాటు,రైతుకు అయ్యే అదనపు వ్యయాన్ని జిల్లా కలెక్టర్ ఆధీనంలోని నిధుల ద్వారా ప్రత్యేక రాయితీగా అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించడం, రైతులను ప్రత్యామ్నాయ లాభదాయక పంటల వైపు ప్రోత్సహించడం,అలాగే ఒంటరి మహిళలను ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ ప్రత్యేక ప్రోత్సాహకాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ఒంటరి మహిళా రైతులు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ సాగు చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పొందాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సమీప ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.



## సామాజిక న్యాయమే నా లక్ష్యం

### నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తాం

### తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇన్‌చార్జ్ సలేంద్ర కొమరయ్య




పెద్దపల్లి,జూలై17:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి రాజకీయాల్లో బలమైన ముద్ర వేసే దిశగా తెలంగాణ రక్షణ సేన అడుగులు వేస్తోంది. పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమరయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ కీలక బాధ్యతలను తనకు అప్పగించిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, బీసీల పక్షపాతిగా ఆమె చేస్తున్న కృషిని కొనియాడారు. శుక్రవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సలేంద్ర కొమరయ్య మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా జిల్లాలో అగ్రవర్ణాల నాయకత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ,అణచివేత ధోరణిని అవలంబించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక బీసీ బిడ్డకు పెద్దపల్లి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం ద్వారా కవిత సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని,బీసీలకు 50 శాతం రాజకీయ వాటాను కల్పిస్తామన్న ఆమె హామీ వెనుకబడిన వర్గాలకు కొత్త ఆశను కల్పించిందని ఆయన పేర్కొన్నారు. పార్టీ అధినేత్రి కవిత నాయకత్వంలో వెనుకబడిన తరగతుల కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పాంచజన్యం పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా అయితే వెనకడుగు వేయకుండా పోరాటం చేశామో,అదే స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి వచ్చే వరకు పార్టీ అధినేత్రి కవితకు అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. నియోజకవర్గం లోని ఉద్యమకారులు,బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ సంఘాలన్నింటినీ సమన్వయం చేసుకుంటూ,పార్టీ పిలుపు మేరకు తెలంగాణ రక్షణ సేన పార్టీని పెద్దపల్లిలో శక్తివంతమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతామని సలేంద్ర కొమరయ్య ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమరయ్య నియమించడం పట్ల ఆ పార్టీ జిల్లా నాయకులు,బీసీ సంఘం నేత ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. అనేక ఉద్యమాల్లో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని,పార్టీ బలోపేతానికి సలేంద్ర కొమరయ్య అందించిన సహకారం అభినందనీయమని కొనియాడారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొంటూ,జిల్లా రక్షణ సేన శ్రేణుల తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలోబొంగోని శంకరయ్య గౌడ్,ఉస్తాం శ్రీనివాస్ ముదిరాజ్,బొంకూరి సుభాష్,కల్వల తిరుపతి,చిట్టుమల్ల హనుమాండ్లు, చిలుక ఆనంద్,గడ్డం వెంకటేష్,ఎంచెర్ల స్వామి,పిల్లి శివ,పల్లె శ్రీనివాస్,మేకల శ్రీనివాస్,రాజ్ కుమార్ యాదవ్,విశ్వతేజ,కల్వల రవీందర్,కారుపాకాల రాజేందర్,కారుపాకాల రమేష్ తదితరలు పాల్గొన్నారు

## బందంపల్లి చెరువు కట్టపై తీగల వంతెన

### -రూ.3 కోట్లతో మినీ ట్యాంక్ గా సుందరీకరణ

పెద్దపల్లి,జూలై 17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వినోదాన్ని,ప్రకృతి ఒడిలో ప్రశాంతతను అందించే లక్ష్యంతో బందంపల్లి చెరువు కట్టను రూ. 3 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ నుగుల్ల మల్లయ్య,మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌లతో కలిసి పరిశీలించిన ఆయన,నగరాన్ని దశలవారీగా ఆధునిక హంగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ పనులను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు పర్యాటక వసతుల్లో భాగంగా తీగల వంతెన నిర్మిస్తామని ప్రకటించి, ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ



రాజీ పడకూడదని గుత్తేదారును కఠినంగా హెచ్చరించిన ఎమ్మెల్యే, నిధుల కొరత లేకుండా చూస్తామని,అవసరమైతే మరిన్ని అదనపు నిధులు మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో స్థానిక కౌన్సిలర్ పురేళ్ళ శైలజా సుధాకర్,ఇరిగేషన్ శాఖ అధికారులు,ఇతర ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని ఈ అభివృద్ధి పనుల వేగవంతంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరి బాధ్యత: జాజాల రమేష్



ధర్మపురి, జూలై 17 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణం లో అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సంద ర్భంగా ప్రతి పౌరుడు చట్టాల పై అవగాహన కలిగి ఉండాలని ధర్మపురి కోర్టు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవల సంస్థ డి ఎల్ ఎస్ ఏ ద్వారా ఆర్థికంగా బలహీనులు, చట్ట ప్రకారం అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారు జిల్లా న్యాయ సేవల సంస్థను సంప్రదించి న్యాయ సహాయాన్ని పొందాలని సూచించారు. న్యాయం ప్రతి పౌరుడి హక్కు చట్టాల పై అవ గాహన ప్రతి ఒక్కరి బాధ్యత అని జాజాల రమేష్ అన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ బీఎల్ఏలు కృషి చేయాలి

### - జగిత్యాల డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య



జగిత్యాల ప్రతినిధి జూలై 17 (ప్రజాకలం) రాజ్యాంగం కల్పించిన విలువైన ఓటు హక్కును అర్హులైన ప్రతి పౌరుడు పొందేలా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య అన్నారు. శుక్రవారం జగిత్యాల మండలంలోని పోలాస గ్రామంలో పర్యటించిన ఆయన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు, పార్టీ నాయకులతో సమావేశమై ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలని, ఓటు హక్కుకు అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్పందించి పరిష్కరించేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నందయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు..!



మల్లాపూర్, జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి):

మల్లాపూర్ మండల కేంద్రంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతుండటం ప్రజల్లో అసంతృప్తికి కారణమైంది. విద్యుత్‌ను ఆదా చేయాల్సిన సమయంలో పగటి వేళల్లోనే వీధి దీపాలు వెలుగుతుండటంతో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోందని స్థానికులు అంటున్నారు. ప్రతిరోజూ ఇలాంటి పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. విద్యుత్ పొదుపు గురించి ప్రజలకు సూచనలు చేసే అధికారులు, తమ ఆధ్వర్యంలో ఉన్న వీధి దీపాల నిర్వహణలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించడం విమర్శలకు దారితీస్తోంది. వీధి దీపాల ఆటోమేటిక్ వ్యవస్థలో లోపమా? లేక నిర్వహణలో నిర్లక్ష్యమా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రేమ పేరుతో నమ్మించి.. అఘాయిత్యం

### - నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష

పెద్దపల్లి,జూలై 17:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రేమ,పెళ్లి పేరుతో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు దున్నపోతుల కుమార్ (23)కు పెద్దపల్లి పోక్సో ప్రత్యేక న్యాయస్థానం10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ సంచలన తీర్పు



వెలువరించింది. ఓదెల మండలం కొలనూర్ గ్రామానికి చెందిన నిందితుడు,అదే గ్రామానికి చెందిన 9వ తరగతి బాలికను ప్రేమ పేరుతో వేధించి,నమ్మించి రెండుసార్లు బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడగా,బాధితురాలు గర్భవతి కావడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా,పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్ పటిష్టమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫోక్సో జిల్లా న్యాయమూర్తి స్వప్నరాణి నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేశారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి,ఏసీపీ జి.కృష్ణ,సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్ రావు,పోత్కపల్లి ఎస్సై చి.సనత్ కుమార్,కోర్టు కానిస్టేబుల్ పి.శ్రీనివాస్,లైజన్ ఆఫీసర్ పి.కోటేశ్వరరావులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేకంగా అభినందించారు.

# భూ రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

## - తహసీల్దార్ రామ్‌చందర్

మల్లాపూర్, జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి): భూభారతి కార్యక్రమంలో భాగంగా



చేపడుతున్న భూ రీ సర్వే ద్వారా భూముల సరిహద్దు వివాదాలు, గ్రామ హద్దులకు సంబంధించిన సమస్యలు పరిష్కారమవుతాయని మల్లాపూర్ తహసీల్దార్ రామ్‌చ ఒదర్ తెలిపారు. శుక్రవారం మండలం లోని గుండంపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ రీ సర్వే ప్రక్రియలో గ్రామస్తులు చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని కోరారు. గ్రామ హద్దులను స్పష్టంగా గుర్తించడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రికార్డులను పారదర్శకంగా రూపొందించవచ్చని వివరించారు. రీ సర్వే పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన తహసీల్దార్, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అశోక్, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన సీపీ



పెద్దపల్లి,జూలై 17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలోని జ్యోతి భవన్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో భాగంగా సీపీ అంబర్ కిషోర్ ఝూ,చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీపీ అదనపు కలెక్టర్ అరుణ శ్రీ,గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ కూడా ఉన్నారు.

# ఆదర్శ పాఠశాలలో విద్యా ప్రమాణాలపై సమీక్ష

మల్లాపూర్, జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి): మల్లాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలను ఆర్థిక, సామాజిక అధ్యయనాల కేంద్రం ప్రతినిధి మైసా నరేష్ శుక్రవారం సందర్శించి విద్యా ప్రమాణాలను సమీక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న బోధన విధానం, విద్యార్థుల అభ్యాస స్థాయి, విద్యా వాతావరణంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులతో ఆయన అభిప్రాయాలు సేకరించారు. అనంతరం గ్రంథాలయం, విజ్ఞానశాస్త్ర ప్రయోగశాలలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించి సంబంధిత నమోదులను తనిఖీ చేశారు. పాఠశాలలో క్రమశిక్షణ, నిర్వహణ, విద్యార్థుల ప్రతిభ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రధానోపాధ్యాయులు భూమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది సమష్టిగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇదే నిబద్ధతతో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు తిరుపతి నాయక్, సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉపసర్పంచ్ సోమారెడ్డి, వార్డు సభ్యులు ముష్కరి రమేష్, శేఖర్, నాయకులు ఏనుగు వెంకటేష్ రెడ్డి, పెద్దిరెడ్డి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాల విద్యార్థినుల అద్వితీయ ప్రతిభ

ధర్మారం, జూలై 17 : ( ప్రజా కలం ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రం లోని తెలంగాణ ఆదర్శ పాఠ శాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు



క్రీడల్లో సత్తా చాటుతూ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ పరుగు పందెం లో అద్భుతమైన ప్రతిభ కన బరిచిన 10వ తరగతి విద్యార్థినులు ఎన్ సంధ్య, ఎస్ రితిక, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఏ హర్షిని, ఈ నెల 18న మెదక్ జిల్లాలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు. విద్యార్థినుల ఈ విజయం పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ ఉపా ధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవరావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, వారు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు.

# సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించిన సర్పంచ్ గడ్డం క్రాంతి...

మల్లార్, జూలై 17 ప్రజాకలం ప్రతినిధి.. చిన్నతుండ్ల గ్రామంలోని 1వ మరియు 2వ వార్డులలో సీసీ రోడ్డు నిర్మాణ కార్యక్రమం చిన్నతూండ్ల గ్రామ సర్పంచ్ గడ్డం క్రాంతి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పులిగంటి సదయ్య , పులిగంటి అవినాష్ , పులిగంటి రాజేశ్వరి-రమేష్ , మంతెన సరిత-రమేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు పులిగంటి రాజయ్య, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు ఐలి చంద్రయ్య, గ్రామ శాఖ యూత్ అధ్యక్షులు ఐలి నాగేష్ , మాజీ ఉపసర్పంచ్ బొబ్బిలి సురేష్ , గ్రామ సీనియర్ నాయకులు కమలాకర్ రావు, కోట శ్రీనివాస్ , ఇమ్మడిశెట్టి సాయిరాం, కోట సమ్మయ్య, కోట లక్ష్మయ్య , పులిగంటి బాపు, కూర నరేష్ , ఓరుగంటి లక్ష్మయ్య, మిరియాల ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.



# 8.795 కిలోల ఎండు గంజాయితో యువకుడు అరెస్టు

## - కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్సై బి. ప్రవీణ్



( వరంగల్/ పర్వతగిరి) జులై 17, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో ఎండు గంజాయి పట్టుబడింది. అన్నారం గ్రామానికి చెందిన ఎస్డి. ఖాజా వయస్సు (25)ను పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 8.795 కిలోల ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం. నిందితుడు 2023 సంవత్సరంలో వినాయక విగ్రహాల వ్యాపారం చేయుటకు అప్పు చేసినాడు. అట్టి వ్యాపారం లో బాగా నష్టం వచ్చి, అప్పు ఎక్కువై, అప్పటి నుండి అతని కుటుంబ పోషణనకు కష్టం ఏర్పడి, ఎలాగైనా డబ్బులు సులభంగా సంపాదించే మార్గం వెతుకుతుండగా, ఒక రోజు పేపర్ లో గంజాయి అమ్మినవాళ్లను పోలీసులు పట్టుకున్నారని, గంజాయి అమ్మిన వ్యక్తులు ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదిస్తారని పేపరులో రాగా దానిని చూసి ఖాజా గంజాయి అమ్మి ఎక్కువ డబ్బులు సులభంగా సంపాదించవచ్చని నిర్ణయించుకొన్నట్లు విచారణలో వెల్లడించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని చింతూరుకు టూర్ వెళ్ళినపుడు అక్కడ ఓడిశా కు వ్యక్తి ఖాజా పరిచయం ఏర్పడి అతను చింతూరుకు వరకు వచ్చి గంజాయి అమ్మి వెల్లుతుంటాడదని ఖాజా కు చెప్పగా తనకు ఇదే సరియైన సమయం అని భావించి, అతని పాత బైక్ అమ్మి, కొత్త యాక్టివా బైక్ తీసుకుని, యాక్టివా బైక్ పై చింతూరు కు వెళ్ళి గంజాయిని కిలో కు రూ. 7000/- చొప్పున కొనుక్కొని వచ్చి, వరంగల్ లోని మరొక నిందితునికి కిలో రూ. 15,000/-కు అమ్మేవాడు. గత రెండు రోజుల క్రితం ఓడిశా కు చెందిన నిందితుడితో ఫోన్ లో మాట్లాడి అతని యాక్టివా బైక్ పై చింతూరుకు వెళ్ళి, సుమారుగా 9 కిలోల ఎండు గంజాయిని కొనుక్కొని ఒక బ్యాగ్ లో 4.720 కిలో గ్రాములు, మరొక సూటుకేసు లో 4.075 కిలో గ్రాములు పెట్టుకొని ఇంటికి తీసుకువచ్చినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం సుమారు 04:30 సమయంలో ఎస్సై బి.ప్రవీణ్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో నిందితున్ని అదుపులో తీసుకొని అతని వద్ద నుండి 8.795 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# పాడి పశువుల కొనుగోలు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**జాబితా ఖరారైన వెంటనే రుణాలు మంజూరు చేసి, లబ్ధిదారుల ఆమోదంతో పాడి పశువులు కొనుగోలు చేయాలి**

**ఇందిరా మహిళా డెయిరీ పథకంలో పరిపాలనా వ్యయాలను నియంత్రించాలి**

**పాడి పశువుల కొనుగోలుకు ఎస్ఓపీ ఖరారు చేసి ప్రతి మండలంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి**

ఖమ్మం, జూలై - 17(ప్రజా కలం న్యూస్ )

ఇందిరా మహిళా డెయిరీ పథకం అమలులో పరిపాలనా వ్యయాలను నియంత్రిస్తూ, నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరా మహిళా డెయిరీ పథకం అమలుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ,లబ్ధిదారుల జాబితా ఖరారైన వెంటనే సంబంధిత కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రుణాలు మంజూరైన వెంటనే ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు పాడి పశువుల కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని సూచించారు. పాడి పశువుల కొనుగోలు ప్రక్రియలో లబ్ధిదారుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని, లబ్ధిదారులు పరిశీలించి ఆమోదించిన పశువులనే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు బృందంలో లబ్ధిదారులతో పాటు అనుభవజ్ఞులైన పశువైద్యులు, సంబంధిత అధికారులు మాత్రమే పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి వారం 25 మంది లబ్ధిదారులకు మొత్తం 50 పాడి పశువులను కొనుగోలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని, అదే సమయంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పరిపాలనా వ్యయాలను నియంత్రించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్న కలెక్టర్, సాధారణ పశువుల కొనుగోళ్లకు అమలు చేస్తున్న పరిపాలనా వ్యయ



విధానాన్నే ఇందిరా మహిళా డెయిరీ పథకం పశువుల కొనుగోలులోనూ అనుసరించాలని, పరిపాలనా వ్యయాలకు ఒక ప్రామాణిక విధానాన్ని రూపొందించి నిర్ణీత పరిమితికి మించి ఖర్చు చేయరాదని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లోనే పాడి పశువుల కొనుగోలు తేదీలు, కొనుగోలు విధానం, లబ్ధిదారుల బాధ్యతలు, అనుసరించాల్సిన నిబంధన లపై సమగ్ర అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాడి పశువుల కొనుగోలు ప్రక్రియను పూర్తిగా నిబంధనల మేరకు నిర్వహించేందుకు ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ని తక్షణమే ఖరారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో పాడి పశువుల కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ కొనుగోలు ప్రక్రియలో నాణ్యత, పారదర్శకత, ప్రభుత్వ మార్గదర్శకాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్డిఓ శ్రీరామ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.డి. ముజాహిద్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, ఎంపీడీవోలు, ఏపీఎంలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఫ్లోరోసెన్స్ గైడెడ్, రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు

ఖమ్మం జులై 17(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సర్జికల్ ఆంకాలజీ , ఆంకాలజీ రోబోటిక్ సైన్సెస్ డాక్టర్ చిన బాబు మాట్లాడారు . క్యాన్సర్ నిర్ధారణ చికిత్స రంగంలో సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిందని , క్యాన్సర్ను నయం చేయడమే కాదు రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చడం కూడా ఆధునిక శస్త్రచికిత్సల లక్ష్యం అని , ట్యూమర్ బయాలజీపై మెరుగైన అవగాహన పెరగడంతో నేటి క్యాన్సర్ శస్త్రచికిత్సల లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాకుండా రోగికి మంచి జీవన నాణ్యతను అందిస్తూ పూర్తిగా నయం చేస్తుందని అన్నారు . అత్యంత ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలలో రోబోటిక్ శస్త్రచికిత్స మరియు ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ ఒకటి . ఈ ఆధునిక టెక్నాలజీలు అత్యంత ఖచ్చితత్వం , తక్కువ టిష్యూ డ్యామేజ్, తక్కువ రక్తనష్టం మరియు వేగవంతమైన కోలుకునే అవకాశాలను అందిస్తున్నాయి .హై-డెఫినిషన్ 3డి విజన్ , ట్రెమర్ - ఫ్రీ ఇన్‌స్ట్రుమెంట్స్, మరియు మనిషి చేతి కదలికలను అనుకరించే రైస్టెడ్ ఇన్స్ట్రుమెంట్స్ ద్వారా క్లిష్టమైన శస్త్రచికిత్సలను అత్యంత నైపుణ్యంతో నిర్వహించవచ్చు . సాధారణంగా చెప్పాలంటే పెద్ద కోతలు లేకుండా కేవలం 8 ఎఎ చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స నిపుణుడు తన చేతులు శరీరం లోపల పనిచేస్తున్నట్లుగా ఆపరేషన్ చేయగలుగుతారు . దీని వలన రోగికి తక్కువ నొప్పి, చిన్న మచ్చలు , తక్కువ రక్తనష్టం కలుగుతుంది . ఇంకా స్మార్ట్ టెక్నాలజీ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలయికతో శస్త్రచికిత్సలు మరింత ఖచ్చితంగా , సురక్షితంగా మారుతున్నాయి . మహిళల క్యాన్సర్లలో రోబోటిక్ సర్జరీ ముఖ్యంగా గర్భాశయ మరియు అండాశయ క్యాన్సర్లలో రోబోటిక్ శస్త్రచికిత్స గొప్ప ఫలితాలను ఇస్తోంది . రడికల్ హిస్టెరెక్టమీ మరియు లింఫ్ నోడ్ డిస్సెక్షన్ వంటి క్లిష్టమైన ఆపరేషన్లు సురక్షితంగా చేయవచ్చు . గతంలో 4-5 రోజుల ఆసుపత్రి ఉండాల్సి వచ్చేది . ఇప్పుడు చాలామంది రోగులను 24 గంటల్లోనే డిశ్చార్జ్ చేయవచ్చు . రొమ్ము క్యాన్సర్‌లో ఫ్లోరోసెన్స్





గైడెడ్ సర్జరీ రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కూడా ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీ కొత్త దిశను చూపుతోంది. ప్రత్యేకమైన డై ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత , క్యాన్సర్ నుండి మొదట ప్రభావితమయ్యే సెంటినెల్ లింఫ్ నోడ్స్ (సెంటినల్ లింఫ్ నోడ్స్ ) ప్రత్యేక కెమెరా ద్వారా స్పష్టంగా కనిపిస్తాయి . దీని వలన అవసరమైన లింఫ్ నోడ్స్‌ను మాత్రమే ఖచ్చితంగా తొలగించవచ్చు . గతంలో లాగే అన్ని లింఫ్ నోడ్స్ తొలగించాల్సిన అవసరం తగ్గి, చేతి వాపు (లైఎంపిహెడేమా ) , నొప్పి మరియు ఇతర సమస్యలు గణనీయంగా తగ్గుతాయి . ఇది రోగి జీవన నాణ్యతను మరింత మెరుగుపరుస్తుంది . యూరాలజీ క్యాన్సర్లలో సరికొత్త మార్పులు ప్రోస్టేట్ , బ్లాడర్ , కిడ్నీ మరియు అడ్రినల్ ట్యూమర్ల చికిత్సలో రోబోటిక్ టెక్నాలజీ పెద్ద మార్పు తీసుకొచ్చింది . ప్రోస్టేట్ మరియు బ్లాడర్ క్యాన్సర్లలో పెల్విక్ ప్రాంతం చాలా ఇరుకుగా ఉండటం వల్ల ఓపెన్ సర్జరీ క్లిష్టంగా ఉండేది . ఇప్పుడు రోబోటిక్ సర్జరీ ద్వారా మెరుగైన నేర్వె ప్రెజర్వేషన్ సాధ్యమై , ఉరినరీ కంటినయన్స్ మరియు సెక్సువల్ ఫంక్షన్ మెరుగ్గా కాపాడవచ్చు . కిడ్నీ క్యాన్సర్లలో రోబోటిక్ సర్జరీ వలన పార్టియల్ నీఫరెక్టమీ ఎక్కువగా చేయగలుగుతున్నాం . అంటే కేవలం ట్యూమర్ ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి , మిగిలిన ఆరోగ్యకరమైన కిడ్నీని కాపాడటం సాధ్యమవుతోంది. దీని వలన పూర్తి కిడ్నీ తొలగించాల్సిన అవసరం తగ్గి , క్యాన్సర్ నియంత్రణలో ఎలాంటి రాజీ లేకుండా మంచి ఫలితాలు సాధించవచ్చు .

## నీట్ యూజీ-2026 ఫలితాలలో

# వైబ్రంట్ అకాడమి విజయదుంధిభి



హనుమకొండ జులై 17 ప్రజా కలం ప్రతినిధి

నీట్ యూజీ-2026 ఫలితాలలో వైబ్రంట్ అకాడమి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని వైబ్రంట్‌అకాడమి డైరెక్టర్ సిహెచ్ రాజేంధర్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా అకాడమి డైరెక్టర్ సిహెచ్ రాజేందర్రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థుల కోసం కోటా రాజస్థాన్ వారి వైబ్రంట్ అకాడమిని వరంగల్లో స్థాపించడం జరిగిందని తెలియజేస్తూ గురువారం రోజున విడుదల చేసిన నీట్ యూజీ-2026 ఫలితాలలో వైబ్రంట్ అకాడమి విద్యార్థులు అత్యధికంగా ర్యాంకులు సాధించారని,ఇలాంటి ర్యాంకులు మొదటి బ్యాచ్లోనే సాధించడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. వైబ్రంట్ అకాడమి మొదటి నుండి నీట్ మరియు జేఇఇ లలో అత్యుత్తమమైనటువంటి శిక్షణను వరంగల్లో అందించడం జరుగుతుందని గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులను సైతం చక్కటి అకాడిమిక్ ప్రోగ్రామింగ్ మరియు ప్రణాళికల ద్వారా అద్భుతమైన ఆణిముత్యాలుగా తయారుచేసి జాతీయ స్థాయిలోనే ఉన్నతమైన ర్యాంకులు సాధించడం జరిగిందని తెలిపారు. అనంతరంనం జాతీయ స్థాయిలో ఉన్నతమైన ర్యాంకు AIR-143 బి.వినాయక్ HT.No.4205102271,12 మంది అత్యుత్తమైన ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నిరంతర పర్యవేక్షణ,యోగా మరియు మోటివేషన్తో మామూలు విద్యార్థులను కూడా మెరికలు తిరిగిన విద్యార్థులుగా తీర్చి దిద్దడం జరుగుతుందని,ప్రతి విద్యార్థిపైన వ్యక్తిగతమైన శ్రద్ధ తీసుకోవడం వలనే ఈ ఫలితాలు సాధించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైబ్రంట్ అకాడమి ప్రిన్సిపాల్ టి. శేషుకుమార్,అడ్మినిస్ట్రేషన్ హెడ్ జి. రఘుపతి,కోఆర్డినేటర్ రామ్ గుమ్మడి,అధ్యాపక బృందం మరియు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీట్- 2026 ఎంట్రన్స్ ఫలితాలలో

# 'షైన్' విద్యార్థుల విజయకేతనం



Md. Akhib Ali (Roll No. 4205110050) 504 Marks | M. Nalin Prabhath (Roll No. 4205105052) 480 Marks | T. Hasini (Roll No. 4205101058) 406 Marks | S. Sai Prashanthi (Roll No. 4205108135) 396 Marks

హనుమకొండ జూలై 17 ప్రజాకలం ప్రతినిధి

నీట్ యూజీ-2026 ఎంట్రన్స్ ఫలితాలలో షైన్ జూనియర్ కళాశాల విద్యార్థులు కార్పోరేట్ విద్యాసంస్థలకు సమానంగా ఫలితాలు సాధించినట్లు షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు రమ,కవిత, రాజేంద్రకుమార్,మూగుల రమేష్లు సంయుక్తంగా తెలియజేశారు. ఈ సందర్భంగా మూగుల కుమార్ యాదవ్ మాట్లాడుతూ... షైన్ విద్యాసంస్థలు మొదటి నుండి నీట్,జేఈఈ మెయిన్స్,అడ్వాన్స్ లో అత్యుత్తమ శిక్షణను అందిస్తున్నామన్నారు. జాతీయస్థాయిలో ఎం.డి. అకీబ్ అలి (Roll No.4205110050)-504, ఎమ్. నలిన్ ప్రభాత్ (Roll No. 4205105052)-480,టి.హాసిని (Roll No.4205101058)-406, ఎస్. సాయిప్రశాంతి (Roll No. 4205108135) 396 మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. వీరితోపాటు 15 మంది విద్యార్థులు 350 మార్కులకు పైగా సాధించి విజయభేరి మోగించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కుమార్ యాదవ్,యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమశీలో షైన్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్,ప్రశాంత్,అధ్యాపక బృందం,విద్యార్థినీ విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గూడెపుపల్లెలో నూతన తాగునీటి బోరుబావి ప్రారంభం

## కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన వార్డు సభ్యులు పమ్మడి నిరంజన్ రావు

## తీరనున్న స్థానికుల తాగునీటి కష్టాలు.. మంత్రికి కృతజ్ఞతలు

మల్హర్, జూలై 17 ప్రజాకలం ప్రతినిధి



మండల కేంద్రమైన తాడిచర్ల పరిధిలోని గూడెపుపల్లెలో తాగునీటి ఎద్దడి నివారణకు నూతన బోరుబావి నిర్మాణ పనులు గురువారం వేగంగా ప్రారంభమయ్యాయి. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక ఆదేశాల మేరకు.. డిఎంఎఫ్టీ నిధులు రూ. 3 లక్షల 42 వేల వ్యయంతో ఈ బోరుబావి మంజూరైంది. ఈ నిర్మాణ పనులను వార్డు సభ్యులు పమ్మడి నిరంజన్ రావు కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పమ్మడి నిరంజన్ రావు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి, సకాలంలో స్పందించి నిధులు కేటాయించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుబాయి ఉద్యోగాలకై జూలై 21న ఇంటర్వ్యూ నిర్వహణ

- జిల్లా ఉపాధి అధికారిణి మాధవి
- హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ టామ్ కామ్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహణ
- ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు నేరుగా సర్టిఫికెట్ లతో హాజరు కావాలి.

ఖమ్మం, జూలై -17(ప్రజా కలం న్యూస్ )

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దుబాయిలో ఉన్న ఒక ప్రముఖ కంపెనీలో అత్యవసర విదేశీ ఉద్యోగాల అవకాశాల కోసం టామ్ కామ్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూ కు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లీనర్స్, టైల్ మేసన్, ఆల్రౌండ్ మేసన్, బ్లాక్/ప్లాస్టర్ మెసన్ , స్టీల్ ఫిక్సర్, షట్టరింగ్ కార్పెంటర్, ప్లంబర్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, ఫినిషింగ్ కార్పెంటర్, ఎం.ఐ.జి. వెల్డర్, జనరల్ హెల్పర్ ట్రేడులలో 500 మంది అభ్యర్థులు అవసరం ఉన్నదని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు పని గంటలు రోజుకు 9 గంటలు ఓవర్ టైమ్ తో ఉంటాయని, నైపుణ్య గ్రేడ్ ప్రకారం ఓవర్ టైమ్ తో పాటు జీతం అందించబడుతుందని, ఈ నియామకం ఆఫ్ లైన్ ఇంటర్వ్యూ ప్రక్రియ ద్వారా జరుగుతుందని, హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్ సమీపంలో ఉన్న కొత్త టామ్ కామ్ కార్యాలయంలో ఈ నెల 21న నిర్వహించు ఇంటర్వ్యూకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు రెజ్యూమ్, పాస్పోర్టు, విద్యార్హత, అనుభవ ధృవపత్రాలతో నేరుగా హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### రేషన్ కార్డుదారులు జులై 31 లోగా

## ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి

### - డిసిఎస్ఓ మల్లికార్జున బాబు

ఖమ్మం, జూలై -17(ప్రజా కలం న్యూస్ ) జిల్లాలోని రేషన్ కార్డుదారులు రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యులు తమకు కేటాయించిన చౌక ధరల దుకాణానికి వెళ్లి జూలై 31 లోగా బయోమెట్రిక్ ఈ-కేవైసీ పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కొన్ని రేషన్ కార్డులలో ఒకరు లేదా ఇద్దరు సభ్యులు మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేయగా, మిగిలిన వారు ఇంకా ఈ-కేవైసీ చేయించుకోలేదని గుర్తించినట్లు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నిరంతరాయంగా అందేందుకు ప్రతి కుటుంబ సభ్యుడి ఈ-కేవైసీ తప్పనిసరి అని, సందేహాలు ఉంటే సంబంధిత చౌక ధరల దుకాణం లేదా మండల పౌర సరఫరాల అధికారులను సంప్రదించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### బాసర ఆలయానికి నూతనంగా ఎంపికైన అర్చక బృందానికి నియామక పత్రాలు అందజేత



నిర్మల్ జులై 17, (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) భారతదేశంలో పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ క్షేత్రంలో నూతనంగా ఆలయంలో అర్చక బృందం నియామకం కావడంతో, ఈ సందర్భంగా హైదరాబాద్ మహానగరంలోని రవీంద్ర భారతి నిలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, కమిషనర్ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు నిముకులైన అర్చక బృందానికి నియామక పత్రాలను అందజేయగా అదే విధంగా, ఆలయ కార్య నిర్వహణ అధికారిని అంజనాదేవి, తో పాటు ఏఈఓ గంగ శ్రీనివాస్ నియామక పత్రాలను చూసి పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ నుండి వేద పండితులకు పరీక్షలు వ్రాయగా ఈ విధంగా అర్చకులుగా శృతి మురళి శర్మ, మహా విద్య పారాయణ దారుడు, అంకుష్ శర్మ, పరిచరకుడుగా, గోవింద శర్మ, కళాధర్ శర్మ, కిషోర్ పాటక్, శ్రీనివాస్ శర్మ, తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకోగా నేరుగా ఆలయంలో వీరికి నియామక పత్రాలు చూసి ఘన సన్మానం చేపట్టారు. ఆలయ అధికారిని అంజనాదేవి మాట్లాడుతూ... ఈ సందర్భంగా గత కొన్ని సంవత్సరాల నుండి కొందరు వేద పండితులు అర్చకులు పదవి విరమణ పొందిన ఆ స్థానంలో ఖాళీగా ఉన్న వారిని నియమించడం జరిగిందని ఇక నుండి నూతనంగా ఎంపికైన ఆలయానికి అర్చక సిబ్బంది నిత్యం అమ్మవారికి పూజలతో పాటు విధి నిర్వహణలో నియమ నిబంధన పాటించాలని తెలిపారు. అదే విధంగా అమ్మవారి అలంకరణ అభిషేకం పూజ సమయంలో కొందరు తమ వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టి వెళ్లడంతో అప్పుడు కొంతమేర అంతరం కలిగేది ఇప్పుడు అన్ని శ్రావ్యంగా జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శైలేష్ కుమార్ అర్చకులు ప్రవీణ్ తదితరులు ఉన్నారు

### చిన్న వర్షానికే నిండిన డ్రైనేజీలు... తక్షణమే క్లీన్ చేయించిన మున్సిపల్ చైర్మన్



ప్రజా కలం జూలై 17 (గద్వాల ప్రతినిధి) ఇటీవల కురిసిన చిన్న వర్షానికే గద్వాల పట్టణంలో డ్రైనేజీలు నిండిపోయి, మురుగు నీరు రోడ్లపైకి వస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కు స్థానిక ప్రజల నుండి ఫిర్యాదులు అందాయి. ప్రజల ఇబ్బందులపై మున్సిపల్ చైర్మన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు తక్షణమే స్పందించారు. అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి, నీరు నిల్వకు ఉండకుండా డ్రైనేజీ మార్గాలను శుభ్రం చేయించి మరమ్మతులు పన్నులను దగ్గరుండి పర్యవేక్షించారు. సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జయలక్ష్మి నరసింహులు మాట్లాడుతూ... పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత. ప్రజలు ఎవరు కూడా ప్లాస్టిక్ కవర్లు, ఘన వ్యర్థాలను మురుగు కాలువలో వేయవద్దు. దీనివల్ల కాలువలు పుడుకుపోయి చిన్న వర్షానికే ఇల్లు, రోడ్ల ముందర మురుగునీరు చేరుతుంది. ప్రజలందరూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 28 వ వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్, రవి రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

### తానూర్‌లో మండల అభివృద్ధి పనులపై ఎంపీడీఓ సమీక్ష

తానూర్, జూలై 16(ప్రజా కలం): మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీడీఓ శ్రీధర్ అధ్యక్షతన మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విబిజీ రామ్ జీ పనులు, ఐ. హెచ్. హెచ్. ఎల్ మంజూరులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు 90 రోజుల వేతనాల చెల్లింపులపై కీలక చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వర్షాకాల సన్నద్ధత, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి పంచాయతీలో తప్పనిసరిగా 5 వ్యవసాయ కుంటల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, వెంటనే గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, మొక్కల పెంపకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కోరారు. నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

?ఇటీవల మరణించిన బోరిగాం సర్పంచ్ మృతికి సంతాపంగా సమావేశం చివరలో సభ్యులంతా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



### నాబార్డ్ నుంచి ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు

# రాష్ట్ర స్థాయి అత్యున్నత గుర్తింపు

### 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలో ఉత్తమ జిల్లా సహకార కేంద్ర బ్యాంకుగా ఖమ్మం బ్యాంకు ఎంపిక









ఖమ్మం, జూలై 17( ప్రజా కలం న్యూస్)

2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలో ఉత్తమ జిల్లా సహకార కేంద్ర బ్యాంకుగా ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఎంపికైనట్లు బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (బాధ్యతలు నిర్వహిస్తున్న) ఎన్. వెంకట ఆదిత్య తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు, శాఖల నిర్వాహకులు, అనుబంధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఖాతాదారులకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

గత 105 ఏళ్లుగా ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న సేవలు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాధించిన విశిష్ట ప్రగతి కారణంగానే ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం బ్యాంకు కుటుంబం మొత్తం సమిష్టి కృషికి నిదర్శనమని అన్నారు. ఉద్యోగుల అంకితభావం, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యం, సీనియర్ అధికారుల మార్గదర్శకత్వం, శాఖల నిర్వాహకుల సమర్థ నిర్వహణ ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయని తెలిపారు. అలాగే పాలక మండలి దూరదృష్టి, విధానపరమైన సహకారం బ్యాంకు అభివృద్ధికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. బ్యాంకుపై విశ్వాసం ఉంచిన ఖాతాదారులు, అనుబంధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారమే బ్యాంకు అభివృద్ధికి బలమైందని అన్నారు. ఈ పురస్కారం గత విజయాలకు గుర్తింపు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణగా నిలుస్తుందని ఎన్. వెంకట ఆదిత్య పేర్కొన్నారు. పూర్వ ఖమ్మం జిల్లాలోనే అత్యంత విశ్వసనీయమైన, అతిపెద్ద సహకార బ్యాంకుగా ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకును మరింత అభివృద్ధి చేసేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## పుష్కరాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

### భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి

### పుష్కర ఘాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్, జులై 16(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సోన్ మండలంలోని పుష్కర ఘాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్ల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

పుష్కరాల నాటికి ఘాట్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. గత పుష్కరాల్లో నమోదైన భక్తుల రద్దీ వివరాలను తెలుసుకొని, ఈసారి అంచనా మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలనన్నారు. చేపట్టే అన్ని పనులు నాణ్యతతో, మన్నికగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కర ఘాట్లకు చేరుకునే మార్గాల్లో స్పష్టమైన సూచికల బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, తగిన పార్కింగ్ సౌకర్యాలు, రాకపోకలకు అనువైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. భక్తుల భద్రత, పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, లైటింగ్ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఈ పరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ అనిల్, తహసీల్దార్ సంతోష్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలి

### ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఆన్ లైన్ వేగంగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ ,జులై 16(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, శుక్రవారం ఖానాపూర్ మండలంలో పర్యటించారు. గోదావరి నది పుష్కర ఘాట్లను పరిశీలించారు. పట్టణంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ తీరును చూశారు. ముందుగా ఖానాపూర్ పట్టణంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ సరళిని చూశారు. తప్పనిసరిగా గడువులోగా ఆన్ లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తం ఓటర్ల సంఖ్య, ఇప్పటి వరకు తిరిగి తీసుకున్న ఫారములు, పూర్తిచేసిన ఆన్ లైన్ వివరాలు అధికారులను అడిగారు. బిఎల్ఓ యాప్ ను పరిశీలించారు. ప్రక్రియను మొత్తం పారదర్శకంగా చేయాలని అన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని చెప్పారు. బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో ఓటర్లకు ఫారములు నింపుటలో సహకారం అందించాలని చెప్పారు. అనంతరం గోదావరి నది పుష్కర ఘాట్లను పరిశీలించారు. గోదావరి నది పుష్కరాల నిర్వహణకు ఇప్పటినుంచే తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు పుష్కరఘాట్లకు చేరుకునే విధంగా తగిన రోడ్డు సౌకర్యం కల్పించాలని అన్నారు. పుష్కర ఘాట్లను భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సిద్ధం చేయాలని పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ సోయబ్ హుస్సేన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నచింతకుంట మండలంలో కలెక్టర్ పర్యటన

### – విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 17 : చిన్నచింతకుంట మండలంలో ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), దమగ్నాపూర్ లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా చిన్నచింతకుంటమండలంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు ఆర్. బి. ఎస్. కె కార్యక్రమం కింద వైద్య బృందం నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు, ఎంతమంది రక్త నమూనాలు సేకరించారు, పరీక్షల్లో గుర్తించిన ఆరోగ్య సమస్యలు ఏమిటి, రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఎలాంటి చికిత్స అందిస్తున్నారనే అంశాలపై ఆర్‌బీఎస్‌కే వైద్య బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యత, వసతి, తాగునీరు, పరిశుభ్రత, విద్యాబోధన తదితర అంశాలపై విద్యార్థినులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా, వసతి సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తదనంతరం దమగ్నాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామచందర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, మండల, గ్రామ అధికారులు ఉన్నారు.



### కూసుమంచి కేజీబీవీలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం.



పాలేరు జులై 17( ప్రజా కలం న్యూస్) ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి ( డిఇఓ) ఉత్తర్వుల ప్రకారం, కూసుమంచి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ ) నందు ఇంగ్లీష్ మీడియంలో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయుటకు అర్హులైన బాలికల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ ( ఎస్ ఓ ) అజిత కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ విద్యాలయంలో 6వ తరగతిలో 05 సీట్లు, 7వ తరగతిలో 02 సీట్లు, 8వ తరగతిలో 2 సీట్లు, 9వ తరగతిలో 3 సీట్లు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ( సి ఈ సి ) నందు 15 సీట్లు ఖాళీగా అందుబాటులో ఉన్నాయని, అర్హత గల విద్యార్థినులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మా విద్యాలయంలో చేరిన విద్యార్థినులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యతో పాటు పూర్తి సురక్షితమైన వసతి గృహ సదుపాయం, మెనూ ప్రకారం ప్రతిరోజు రుచికరమైన పౌష్టికాహారం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగులు మరియు యూనిఫార్ములు ప్రభుత్వం తరపున కల్పించబడ్డాయని పేర్కొన్నారు. మహిళా సిబ్బంది పర్యవేక్షణలో అత్యుత్తమ భద్రతతో పాటు విద్యార్థినులలో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ప్రత్యేకంగా 'హెషీబ్ండ గైడ్స్' యూనిట్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు వెంటనే పాఠశాల పనిదినములలో అవసరమైన ధృవీకరణ పత్రాలతో కూసుమంచి కేజీబీవీ విద్యాలయాన్ని నేరుగా సందర్శించి దరఖాస్తులు సమర్పించవలసిందిగా స్పెషల్ ఆఫీసర్ అజిత కుమారి సూచించారు.

### ఉద్యోగ మేళాకు విశేష స్పందన 100 పైగా అభ్యర్థుల హాజరు.. 60 మంది షార్ట్‌లిస్ట్




నిర్మల్ జూలై 17(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించినట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి విజయలక్ష్మి తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో స్వతంత్ర మైక్రోఫిన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించిందన్నారు. మొత్తం 80 మంది అభ్యర్థులు హాజరుకాగా, వారిలో 60 మందిని షార్ట్‌లిస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. తుది ఎంపిక ఫలితాలను సంస్థ త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం నిర్వహించే ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను పొందాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి సూచించారు.

### లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

## వెంటనే మంజూరు చేయాలి

### ఇంటింటి సర్వేలో డిమాండ్ చేసిన -సిపిఐ (ఎం) మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్



మరిపెడ ప్రజాకలం న్యూస్ జులై 17 రెండోవిడతఇందిరమ్మఇండ్లను వెంటనే మంజూరు చేయాలని ఇప్పటికే ఫస్ట్ విడుదల ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సిపిఐ (ఎం) మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ అన్నారు. శుక్రవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో సిపిఐ (ఎం) ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ మరిపెడ మండలంలో 655 ఇండ్లు మొదటి విడతలు మంజూరు కాగా, అందులో 242 పూర్తిచేసుకున్నాయని తెలిపారు. మిగతా ఇండ్లు వివిధ దశలో నిర్మాణాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు పూర్తయిన 242 ఇండ్లకు వెంటనే బిల్లు పెండింగ్ లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అబ్బాయిపాలెం గ్రామంలో 120 మంది ఇల్లు లేని నిరుపేదలు ఇండ్ల కోసం ఆన్లైన్ చేసుకోగా అందులో మొదటి విడతలో 32 మంజూరైనట్లు అందులో ఒకటి రెండు మినహా మిగినే అన్ని నిర్మాణంలో ఉన్నాయని , ఇందులో సగం ఇల్లు పూర్తయినట్లు మధు వివరించారు. ఎల్ 3, ఎల్ 2, కేటగిరి లో ఉన్న ఇండ్లను అధికారులు పరిశీలించి వారందరికీ పెండింగ్ బిల్లులు మంజరైన చేయాలి, లేదా కొత్త ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేగాక ఈ గ్రామంలో నిరుపేదలు ఎక్కువమంది ఉన్నారని, ఉపాధి హామీ పథకంలో 12000 రూపాలు ఇస్తామని ప్రభుత్వంగత ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, వెంటనే దానిని వర్తింపచేయాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ(ఎం) వార్డు సభ్యురాలు నందిపాటి ఉప్పలమ్మ వెంకన్న, నాయకులు లచ్చయ్య, కామిడ్ల వెంకన్న, జినక సైదులు, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు తప్పనిసరి గా పనిచేసేలా చూసుకోవాలి

### – అనుమానాస్పద వ్యక్తులు కనపడితే వెంటనే పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వండి

### – మరిపెడ సబ్ ఇన్స్పెక్టర్లూ గంగ్రతి సతీష్ ప్రభాకర్ రెడ్డి



మరిపెడ ప్రజాకలం న్యూస్ జులై 17 మరిపెడ మండల కేంద్రంలో ఉన్న ఫైనాన్షియల్ సంస్థలు అయినటు వంటి ముత్తూట్ ఫైనాన్స్ కీర్తన శ్రీరాం ఫైనాన్స్ బ్రాంచ్ లాంటి ఆఫీసులో మరియు అలాగే షాపులను తనిఖీ చేసిన మరిపెడ సబ్ ఇన్స్పెక్టర్ గంగరాజు సతీష్ మరియు ప్రభాకర్ రెడ్డి లు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యాలయానికి సీసీ కెమెరాలు భద్రత చాలా ముఖ్యం అన్నారు అలారం సిస్టం లాంటి భద్రత ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలి అన్నారు వివిధ బ్రాంచ్ల మేనేజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు గోల్డ్ లోన్ తీసుకోవడానికి వచ్చిన వ్యక్తుల వివరాలు తప్పనిసరిగా సేకరించాలి అన్నారు ఎవరైనా గోల్డ్ లోన్ తీసుకుని వ్యక్తులు అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించాలని తెలిపారు

# కౌకుంట్ల మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- పుట్టపల్లి, పేరూరు గ్రామాల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,జడ్.పి.పాఠశాల అంగన్వాడీ కేంద్రం లు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,పశు వైద్య శాల తనిఖీ
- పేరూరు అంగన్వాడీ 3 కేంద్రం లో మెనూ పాటించకపోవడం,పరిశుభ్రత లేకపోవడం తో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అంగన్వాడీ టీచర్,ఆయాలకు షోకాజ్ నోటీస్ జారీ - జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజాకలం ప్రతినిధి జులై 17 :

కౌకుంట్ల మండలంలోని పుట్టపల్లి, పేరూరు గ్రామాలలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువైద్య కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పుట్టపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించారు. బోర్డుపై రాసిన అక్షరాలను విద్యార్థులతో చదివించి వారి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు, గైర్హాజరు వివరాలు తెలుసుకోవడంతో పాటు ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. తదుపరి పుట్టపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. అంగన్వాడి కేంద్రానికి హాజరవుతున్న గర్భిణుల సంఖ్య, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం పేరూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ల్యాబ్ సిబ్బంది వివరాలు, రోజువారీ పరీక్షల సంఖ్య, సిబ్బంది ఎంతమంది ఉన్నారు అనే విషయాలను వైద్య అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ గర్భిణితో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు.అనంతరం పేరూరులోని పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేసి పశువులకు అవసరమైన మందులు, టీకాలు అందిస్తున్నారా లేదా పరిశీలించారు. పశు వైద్య కేంద్రం కేంద్రం సమీపంలోని మురుగు కాలువ అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే కాలువను శుభ్రం చేసి ఫొటోలు పంపించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పేరూరు అంగన్‌వాడీ 3 కేంద్రంలో తనిఖీ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం ఆహారం అందించకుండాకేవలం అన్నం, నీళ్ల చారు మాత్రమే ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలాగే కేంద్రంలో పరిశుభ్రత లోపాలను గుర్తించి సంబంధిత అంగన్‌వాడీ టీచర్, ఆయాపై విధుల పట్ల నిర్లక్ష్య వైఖరికి షోకాజ్ నోటీసులు జారీ కి ఆదేశించడంతో జిల్లా సంక్షేమ అధికారి షోకాజ్ నోటీస్ లు జారీ చేశారుచివరిగా పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సమీపంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,మండల అధికారులు ఉన్నారు.

# వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

**తక్కువ నీటి అవసరమయ్యే పంటల వైపు రైతులు మళ్లాలి**

**'తెలంగాణ జలసిరి'తో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలి**

**ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగింపు - జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

నిర్మల్ జూలై 17 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ, జల సంరక్షణ చర్యలు, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎల్‌నీనో ప్రభావంతో జూలై నెలలో సుమారు 30 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా సోన్ మండలంలో 50 శాతం వరకు వర్షాభావం ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 4.30 లక్షల ఎకరాల్లో పంటల సాగు కొనసాగుతోందన్నారు. నీటి లభ్యతను అంచనా వేసిన తర్వాతే వరి నాట్లు వేయాలని రైతులకు సూచించిన కలెక్టర్, సాగునీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా కంది, ఆయిల్‌పామ్, కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలను సాగు చేయాలని కోరారు. ఒక ఎకరంలో కంది పంట ద్వారా 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా లాభపడే అవకాశం ఉందన్నారు. వరి సాగు వల్ల నీటి కొరత కారణంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో అవగాహన పెరుగుతోందని, గతంలో 400 ఎకరాల్లో ఉన్న సాగు విస్తీర్ణం ఈ ఏడాది 1,200 ఎకరాలకు పెరిగిందని తెలిపారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు సాగు చేసే అవకాశం ఉండటంతో పాటు ప్రభుత్వం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు కూడా అందిస్తోందన్నారు. పందిరి కూరగాయల సాగుకు 50 శాతం రాయితీ అందుబాటులో ఉందని చెప్పారు. బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చని, డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం రాయితీలు ఇస్తోందని వివరించారు. రైతులకు అవసరమైన సలహాలు, సాంకేతిక మార్గదర్శకాలు అందించేందుకు 89777 51785 హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాల



సంరక్షణకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. "ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత, ప్రతి పొలానికి ఒక ఫామ్ పాండ్" లక్ష్యంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. 8×8, 16×16, 20×20 పరిమాణాల్లో ఫామ్ పాండ్లు నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని భూగర్భ జలాలను పెంపొందించవచ్చన్నారు. బోర్‌వెల్‌ల వద్ద రీచార్జ్ పిట్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. వివిజి రామ్‌జీ పథకం కింద ఫామ్ పాండ్ల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖలు సమన్వయంతో గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పంట మార్పిడి, నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత ప్రచారం చేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగిస్తూ తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ఎంచుకోవడం ద్వారా రైతులు నష్టాలను నివారించి లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రభుత్వం ఆగస్టు 3 వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 75 శాతం డిజిటలైజేషన్ పూర్తి కాగా, అన్‌కలెక్టెడ్ ఫారాల పరిష్కారంతో కలిపి మొత్తం 81 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన ఫారాల సేకరణ, డిజిటలైజేషన్‌ను బీఎల్ఓలు, బీఎల్ఏలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సమన్వయంతో నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, జిల్లా పౌరసంబంధాల అధికారి విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ - ఎల్నీనో దృష్ట్యా వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించేలా అధికారులు కార్యాచరణ**

**కూరగాయల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగు విస్తీర్ణాన్ని పెంచాలి**

**ప్రతి ఏఈఓ కనీసం 50 ఎకరాల చొప్పున కూరగాయలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాల సాగుకు రైతులను ప్రోత్సహించాలి**

ఖమ్మం, జూలై - 17( ప్రజా కలం న్యూస్ )

ప్రస్తుత సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖ తదితర అనుబంధ శాఖల అధికారులతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోందని, భూగర్భ జలాలు క్రమంగా తగ్గుతున్నాయని, చెరువుల్లో కూడా తగినంత నీటి నిల్వలు లేవని అన్నారు. ఈ పరిస్థితుల్లో అధిక నీటి అవసరమయ్యే వరి, పత్తి వంటి పంటల సాగును ప్రోత్సహించవద్దని, రైతులను పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే వరి సాగు విస్తీర్ణాన్ని కనీసం 25 శాతం మేర తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలు వేసేలా మండలాల వారీగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ లక్ష్యం సాధించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఖమ్మం నగరానికి ప్రతిరోజూ అవసరమయ్యే కూరగాయల డిమాండ్ ఎంత ఉంది, ప్రస్తుతం ఏ ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్నాయి, జిల్లాలోని రైతుల ద్వారా ఆ అవసరాలను ఎంత మేర తీర్చవచ్చనే అంశాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. తక్కువ నీటి అవసరమున్న పంటల సాగును రైతులు చేపట్టేలా ప్రోత్సహించాలని తెలిపారు. కోతుల బెడద తక్కువగా ఉండే పంటలను గుర్తించి వాటి సాగుపై రైతులకు సూచనలు అందించాలని, అవసరమైన నాణ్యమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) తన పరిధిలో కనీసం 50 ఎకరాల్లో కూరగాయలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాల సాగుకు రైతులను ప్రోత్సహించి లక్ష్యాలను సాధించేందుకు




కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల వారీగా కాలువల క్రింద, బోరు బావుల క్రింద సాగు విస్తీర్ణం, భూగర్భ జలాల ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సమాచారాన్ని గ్రామస్థాయి వరకు రైతులకు చేరవేసి, నీటి లభ్యతను బట్టి ఏ పంటలు సాగు చేయాలో స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. సొంత బోరుబావి ఉన్న రైతులు కూడా సంవత్సరం మొత్తం సరిపడా నీటి లభ్యత ఉంటుందనే పూర్తి భరోసా ఉన్నప్పుడే వరి సాగు చేపట్టాలని, లేకపోతే మధ్యలో నీటి కొరత కారణంగా పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులకు వివరించాలని సూచించారు. జిల్లాలో ఎరువుల నిల్వలను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో, తగిన పరిమాణంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి కొరత తలెత్తకుండా నిరంతరం నిల్వలను సమీక్షిస్తూ, జిల్లాలోని ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిడి. పుల్లయ్య, పశు సంవర్ధక శాఖఅధికారి డాక్టర్ బి.పురంధర్, డిసిఓ గంగాధర్, ఉద్యానవన శాఖ అధికారి అనిత, మత్స్య, ఇతర వ్యవసాయ, ఉద్యానవన శాఖ డివిజన్, మండల అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నీళ్లివ్వడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం

- పంటల వేసుకునేందుకు సాగునీరు నీ వెంటనే విడుదల చేయాలి
- ర్యాలంపాడు,గుడ్డెందొడ్డి, రిజర్వాయర్ల కాలువలను సందర్శించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు



ప్రజా కలం జూలై 17 (గద్వాల ప్రతినిధి) కాలువలో చెట్లు ను తొలగించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని బాసు హనుమంతు నాయుడు అన్నారు. శుక్రవారం గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం పలు గ్రామంలో గుడ్డెం దొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్ ల కింద ఉన్న కాలువలను పార్టీ నాయకులు,రైతులతో కలిసి బాసు హనుమంతు నాయుడు పరిశీలించారు. అనంతరం,గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్ ని సందర్శించి, ప్రస్తుతం రిజర్వాయర్లో నీటి సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. జూరాల రైట్ మెయిన్ కెనాల్ ను సందర్శించిన ఆయన,పూర్తిగా డ్యామేజ్ ఆయనది, దానిని తొందరలో మరమ్మత్తులు చేయాలని సూచించారు. అదే విధంగా మహిళ కూలీలను కలిసినా బాసు హనుమంతు నాయుడు మళ్లీ కెసిఆర్ ప్రభుత్వమే రావాలని వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్డెందొడ్డి రిజర్వాయర్లో 1 టీఎంసీ సామర్థ్యం నీళ్లు ఉన్న,రైతులు పంట పొలాల వేసుకునేందుకు కాలువలకు నీళ్లు ఇవ్వలేని స్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని ధ్వజమెత్తారు. కనీసం కాలువల్లో చెట్లను(జమ్ము) ను తొలగించలేని స్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వము ఉన్నాదని ఆరోపించారు. నీళ్లు ఇవ్వాలని అడిగితే కేటీఆర్, హరీష్ రావు కోసి రక్తం పంటలకు చల్లితే పండు తాయని ముఖ్యమంత్రి అనడం ఎంతవరకు సముచితమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇలా మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులను,ప్రజాస్వామ్యాన్ని అవనమానించేలా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు రెండు పంటలకు సాగునీటిని అందించిన ఘనత కెసిఆర్ దే అని అన్నారు. 24 గంటల విద్యుత్,పెట్టుబడి సాయం, రైతుబీమా వంటి పథకాలు ఎన్నో అందించారని గుర్తు చేశారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఒక్క స్కీం కూడా అమలు చేయలేదని విమర్శించారు. పంటలు వేసుకునేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఎప్పటికప్పుడు నీళ్లిచ్చి,పంటలను కాపాడామని గుర్తు చేశారు. వెంటనే అధికారులు స్పందించి రైతులకు పంటలు వేసుకునేందుకు కాల్వలకు నీళ్లు వదలాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- సంబంధిత రైతుల సమక్షంలోనే సరిహద్దుల నిర్ధారణ చేయాలి
- ప్రజల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేసి పూర్తి అవగాహన కల్పించాలి
- తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా జిల్లా కలెక్టర్



పాలేరు జూలై- 17(ప్రజా కలం న్యూస్ )

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ రీ-సర్వే కార్యక్రమాన్ని అధికారులు సమగ్రంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు. శనివారం పాలేరు నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరును పరిశీలిస్తూ రైతులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియపై రైతులు వ్యక్తం చేసిన సందేహాలు, సమస్యలను ఓర్పుతో విని వాటిపై స్పష్టమైన వివరణ ఇచ్చి నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రతి పట్టాదారు భూమిని సంబంధిత భూ యజమానులు, రైతుల సమక్షంలోనే సర్వే చేసి, సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. భూ రీ-సర్వేపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ అన్నారు. గ్రామస్థులు అడిగే ప్రతి సందేహానికి వెంటనే సమాధానం ఇచ్చి వారికి విశ్వాసం కల్పించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ భూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, అధునాతన సాంకేతిక ప్రమాణాలతో నాణ్యమైన సర్వే నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భూ రీ-సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రైతులకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి రైతు తన భూమికి సంబంధించి ఖచ్చితమైన రికార్డులు పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనతరం తిరుమలాయపాలెం మండలంలో సీతారామ ప్రాజెక్టు లో భాగంగా నిర్మిస్తున్న టన్నెల్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఇర్రిగేషన్ డిఈ రమేష్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నీట్-2026 ఫలితాల్లో మరోసారి అగ్రగామిగా**

# రెసో మెడికాన్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

హనుమకొండ జూలై 17 ప్రజా కలం ప్రతినిధి

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (NEET)–2026 ఫలితాల్లో హనుమకొండలోని రెసో మెడికాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ లెక్కల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా సంస్థ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ఫ్రీ మెడికల్ సీట్లకు అర్హత సాధించే స్థాయిలో మార్కులు పొందారని తెలిపారు. ఈ ఏడాది నీట్ పరీక్షలో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు విశేష మార్కులు సాధించి ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలు పొందే అవకాశాలను మెరుగుపరుస్తుందన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు:శ్యాంకరన్ -655 మార్కులు,గురురాజ్ రెడ్డి -630,కోమల్ - 591,అభిషేక్ - 580,సాక్షి - 546,మహమ్మద్ అద్నాన్ - 528,మణిదీప్ - 528 మార్కులు వేముల జశ్విన్ తేజ్ -500 మార్కులు సాధించారని ఈ సందర్భంగా ఛైర్మన్ లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ..వరంగల్–హనుమకొండ జిల్లాల్లోనే అత్యాధునిక వసతులతో ప్రత్యేకంగా Bi.P.C. + NEET కోచింగ్ క్యాంపస్ ఏర్పాటు చేసి,జాతీయ స్థాయి అనుభవం కలిగిన అధ్యాపకులతో నిరంతర పర్యవేక్షణలో



శిక్షణ అందించడం వల్లే ప్రతి సంవత్సరం ఈ స్థాయి విజయాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెసో మెడికాన్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్తిరావు మాట్లాడుతూ..ఈ ఏడాది మరో 56 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించి ఫ్రీ మెడికల్ సీట్లు పొందే అవకాశాలను మెరుగుపరుచుకున్నారని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులు,అధ్యాపకులు, తల్లిదండ్రులకు సంస్థ యాజమాన్యం అభినందనలు తెలిపింది. ఈ విజయోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో మేనేజింగ్ డైరెక్టర్ దీప్తిరావు,డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి,మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి,సీఈఓ లెక్కల రమ్యా రాజిరెడ్డి,ప్రిన్సిపల్, అధ్యాపకులు,ర్యాంకులు సాధించిన విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## వర్షాలు కురవాలని ముస్లింల ప్రార్థనలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 17 ప్రజా కలం : వర్షాకాలం ప్రారంభమై సుమారు 45 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవలేదు. ఇప్పటికీ లోటు వర్షపాతమే కొనసాగుతోంది. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలో శుక్రవారం మైనార్టీ సోదరులు వర్షాలు భారీగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, చెరువులు, కుంటలు నిండాలని ఆకాంక్షిస్తూ ఈద్గా మైదానంలో ప్రత్యేక సలాతుల్ ఇస్తిస్కా (వర్ష ప్రార్థన) నిర్వహించారు. నమాజ్ అనంతరం అల్లాహ్‌ను వేడుకుంటూ దేశ ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని, కరువు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని హృదయపూర్వకంగా దువా చేశారు. అల్లాహ్ తన అపార కరుణతో సమృద్ధిగా వర్షాలు ప్రసాదించి రైతుల కష్టాలు తొలగించాలని, పంటలు పుష్కలంగా పండాలని అందరూ మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులు, మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా...

### - రైతులు ఆరుతడి పంటలనే సాగు చేయాలి

### - మండల వ్యవసాయ అధికారిని శోభ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 17 ప్రజా కలం : ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురువని నేపథ్యంలో రైతులు వరికి బదులు ప్రత్యమ్నాయ ఆరుతడి పంటలను



సాగు చేయాలని ఎల్లారెడ్డి మండల వ్యవసాయ అధికారిణి శోభ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని సాతెల్లి, అడవి లింగాల, బిక్కనూర్, తిమ్మారెడ్డి గ్రామాలలో రైతులకు ఆరుతడి పంటల గురించి అవగాహన కల్పించారు. వరికి బదులుగా పెసర, మినుము, జొన్నలు, సజ్జలు మొదలైన అరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఏ ఈ ఓ లు రాజా గౌడ్, ముఖీద్, రవీందర్ , ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఆశ కార్యకర్త సంతోష

భుదాన్ పోచంపల్లి జులై 17 ( ప్రజా కలం )

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య రంగంలో అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులను ప్రశంసా పత్రంతో సన్మానించడం జరిగింది.పోచంపల్లి మండలంలోని కాప్రాయపల్లి గ్రామంనికి చెందిన ఆశా కార్యకర్తగా పనిచేయుచున్న సంతోష ను ఉత్తమ ఆశా కార్యకర్తగా గుర్తించి వారికి ప్రశంసా పత్రము అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిని డాక్టర్ శ్రీవాణి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





## జోగిని పునరావాస భూమి కబ్జా ఆరోపణ

### అధికారులకు బాధితురాలి వినతి

ఆర్మూర్,
జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి):

జోగిని పునరావాసంలో భాగంగా ప్రభుత్వం కేటాయించిన భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన దమ్మడి ఎర్రవ్వ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. భూమిని తిరిగి అప్పగించి రక్షణ కల్పించాలని కోరుతూ ఆర్మూర్ తహశీల్దార్, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో శుక్రవారం వినతిపత్రాలు సమర్పించారు. బాధితురాలి వివరాల ప్రకారం.. ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి చెందిన ఎర్రవ్వకు గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1.18 గుంటల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, ఇటీవల కొందరు





వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి దోబీఘాట్ నిర్మించడంతో పాటు బోరు బావి తవ్వారని ఆరోపించారు. తమ వద్ద పట్టాదార్ పాస్‌పుస్తకం సహా అన్ని భూ పత్రాలు ఉన్నప్పటికీ భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇత్వర్‌పేట్ లింగన్న బాధిత కుటుంబానికి మద్దతు తెలిపారు. జోగిని పునరావాసంలో భాగంగా కేటాయించిన భూమిని ఆక్రమించడం తీవ్ర విషయమని పేర్కొంటూ, ఘటనపై అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించి, భూమిని తిరిగి అప్పగించేలా రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## తాళ్ళ రాంపూర్ సర్పంచ్ పావని కుటుంబానికి ఉపసర్పంచ్ ఫోరమ్ పరామర్శ

### రూ.31 వేల ఆర్థిక సహాయం అందజేత

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 17:

ఇటీవల మరణించిన ఏర్గట్ల మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామ సర్పంచ్ బెజ్జరం పావని కుటుంబ సభ్యులను ఉపసర్పంచ్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు



బోట్ల కార్తీక్ శుక్రవారం పరామర్శించారు. జిల్లాలోని పలువురు ఉపసర్పంచ్ ఫోరమ్ మండల అధ్యక్షులు, ఉపసర్పంచ్‌లతో కలిసి ఆయన బాధిత కుటుంబాన్ని కలుసుకుని, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం జిల్లా ఉపసర్పంచ్ ఫోరమ్ తరపున రూ. 31,000 ఆర్థిక సహాయాన్ని పావని కుటుంబానికి అందజేశారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారిని బాగా చూసుకోవాలని పావని భర్త భానుకు బోట్ల కార్తీక్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు ఇస్సాపల్లి మహేష్, ఫోరమ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మూడ్ దయానంద్, ఏర్గట్ల మండలం ఫోరమ్ అధ్యక్షుడు ఆశీరెడ్డి హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ పరామర్శించిన వారిలో వివిధ మండలాల ఫోరమ్ అధ్యక్షులు బద్దం శ్రీనివాస్ రెడ్డి, సామా శ్రీనివాస్ రెడ్డి, శశిధర్, వసంత్ రావు నాయక్, ఇస్సాపల్లి రాజు, కేతిరెడ్డి నర్సారెడ్డిలతో పాటు పలు గ్రామాల ఉపసర్పంచ్‌లు చాట్ల జనార్ధన్, సున్నపు శ్రీనివాస్ ముదిరాజ్, లోలపు రాజు, బొల్ల పల్లి సుమన్ గౌడ్, ద్యాగ ప్రసాద్, అమృ నాయక్, అఖిల్ నాయక్, గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ప్రథమ భూదాత వేదరే రామచంద్ర రెడ్డి 120వ జయంతి

### వెదిరే రామచంద్రారెడ్డి ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి - వెదిరే అరవింద రెడ్డి

భూదాన్ పోచంపల్లి
జులై 17( ప్రజా కలం )

భూదాన్ పోచంపల్లి వెదిరే రామచంద్రారెడ్డి సేవా సమితి జనరల్ సెక్రెటరీ కరగల్ల కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ప్రథమ భూదాత వేదరే రామచంద్ర రెడ్డి 120 వ జయంతి ఉత్సవాలను స్థానిక చౌటుప్పల్ చౌరస్తాలో శ్రీ వేదిరే రామచంద్ర రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు అలంకరించి అతి ఘనంగా జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్వోదయ సేవా సంగ్ జాతీయ అధ్యక్షులు, వెదిర రామచంద్ర రెడ్డి మనవడు వేదిర అరవింద రెడ్డి,సర్వోదయ మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తోలుపునూరి కృష్ణ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదిరే అరవింద్ రెడ్డి మాట్లాడుతూ వెదిరే రామచంద్రారెడ్డి, వినోబా భావే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అదే విధంగా వెదిరే ఇంటర్నేషనల్



ట్రస్టులో(భుదాన్ రామ్ చంద్రారెడ్డి ట్రస్ట్ )కుటుంబ సభ్యులు పాల్గొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రథమ భూదాతగా వెదిరే రామచంద్రారెడ్డి చరిత్రలో నిలిచిపోయారు అని అన్నారు. ఇప్పటివరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాము, ఆడపడుచులకు పెళ్లిళ్లు చేశాము, చదువుకు డబ్బులు కూడా ఇచ్చాము, స్పోర్ట్స్ ప్రోత్సహించి వారికి కావలసిన సదుపాయాలు అందజేశాము. ఇవన్నీ ఎన్నడూ కూడా చెప్పుకోలేదు ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు ముందుండి చేస్తాము. ఇంటర్నేషనల్ గాంధీయాన్ ఫ్యామిలీ ఈ ట్రస్టులో సర్వం మతం, ప్రతి ఒక్కరూ కుల మతం బేధాలు లేకుండా పనిచేస్తారు, హిందూ దేవాలయాలలో వేదాలు చదవాలి, మసీదులలో ఖురాన్ చదవాలి, వచ్చే 6నెలలలోగా పూర్తి చేస్తామని అన్నారు. ఇంకా ఏమైనా ఉంటే ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయం అందజేస్తాము. మొదటగా పోచంపల్లి నుండి ప్రారంభిస్తామని వేదిరే రాంచంద్రరెడ్డి ఆశయం . ప్రతి ఒక్కరికి భూమి, తిండి, చదువు లేని వారు ఉండకూడదని ఆయన ఆశయం మేరకు ప్రతి ఒక్కరికి అందరికీ అందేలా ట్రస్టు ద్వారా సహాయం చేస్తామని కొనియాడారు. హిందూ దేవాలయాలలో తిరుమల తిరుపతి నుండి వేద పండితులను తీసుకువస్తామని వెదిరే రామ చంద్ర రెడ్డి ఆశయాలు ఇంకా ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో శ్రీనివాస్ ముదిరాజ్, శేఖర్, దిలీప్,భూధాన్ పోచంపల్లి గౌడ సంఘం అధ్యక్షులు గునిగంటి మల్లేష్ గౌడ్, శాలివాహన సంఘం వంగూరి రాజు, మోటే రాజు, కొమ్ము లక్ష్మణ్, నల్ల నాగేశ్వర్,కుక్క మారయ్య,పెద్దల నరసింహ, ఎడ్ల లింగస్వామి, కరగల రాములు, నల్ల చిన్న మల్లయ్య, పోతగాళ్ల బాలరాజు,పోతగాళ్ల యాదగిరి, నోముల వెంకటేష్ నేత, చేరాల మహేష్,పోతగల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు,

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

### -జిలాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

### - జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.

యాదాద్రి కలెక్టరేట్ జూలై 17 ప్రజాకలం:ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు, సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి మిషన్ భగీరథ,ఇరిగేషన్,పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో ఎల్‌నినో ప్రభావం వల్ల జిల్లాలో ఏర్పడే తాగునీటి పరిస్థితులపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశం లేకపోవడంతో తాగునీటి వనరుల పరిరక్షణ,సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని,గ్రామాలు,పట్టణాల్లో తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు,సంక్షేమ హాస్టళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలని స్పష్టం చేశారు.మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ హాస్టళ్లు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని,తాగునీటి పరిస్థితులపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా మిషన్ భగీరథ, ఇరిగేషన్,పబ్లిక్ హెల్త్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించు కోవడంతో పాటు,ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్, ఇరిగేషన్,పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు,సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.





# పోలింగ్ కేంద్రాలపై సీఈవో సమీక్ష..

**-పటాన్‌చెరులో సీఈవో సమీక్ష..**

**ఎస్ఐఆర్ వేగవంతానికి ఆదేశం..**



పటాన్‌చెరు, జులై 17 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పటాన్‌చెరు అధికారులను ఆదేశించారు. శుక్రవారం పటాన్‌చెరు నియోజకవర్గంలో పర్యటించిన ఆయన, సుల్తాన్‌పూర్,ఐలాపూర్, భగత్‌నగర్ గల్లీ,ముత్తంగి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఓటరు నమోదు అధికారి,పటాన్‌చెరు తహసీల్దార్, అమీన్పూర్ తాసిల్దార్ అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్, పటాన్‌చెరు, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్లు, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు అనంతరం ఓటరు నమోదు అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో బూత్ స్థాయి అధికారులు, పర్యవేక్షకులు,సహాయ ఓటరు నమోదు అధికారులు, ఓటరు నమోదు అధికారుల పనితీరును ప్రశంసిస్తూ,ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు..

# మహేశ్వరం గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే గ్రామ పంచాయతీ లక్ష్యం

**- మహేశ్వరం ఉచిత హోమియో వైద్య సేవలను ప్రారంభించిన మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్**

మహేశ్వరం, జులై 17,(ప్రజా కలం)

మహేశ్వరం గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే గ్రామ పంచాయతీ లక్ష్యం అని మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ అన్నారు. శుక్రవారం రోజున ఉదయం 10.00 గంటలకు మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిమ్స్ హోమియోపతి మెడికల్ కాలేజ్ & హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ శ్రీ మునగపాటి నవీన్ అధ్యక్షతన ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి ఉచిత హోమియో, ఆయుర్వేద వైద్య చికిత్సా సేవలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే గ్రామ పంచాయతీ ప్రధాన లక్ష్యమని గ్రామ ప్రజలకు పేర్కొన్నారు. ప్రజలకు ఆధునిక వైద్యంతో పాటు హోమియోపతి ఆయుర్వేద వైద్యం కూడా అనేక దీర్ఘకాలిక సాధారణ వ్యాధులకు సమర్థవంతమైన చికిత్సను అందిస్తుందని తెలిపారు. ఇట్టి హోమియోపతి ఆయుర్వేద మందుల ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లు ఉండవని ప్రజలు నిరభ్యంతరంగా వాడుకోవచ్చని, గ్రామ ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఈ ఉచిత హోమియో ఆయుర్వేద వైద్య సేవలు ప్రతి శుక్రవారం ఉదయం గ్రామ పంచా యతీ కార్యాలయంలో నిరంతరంగా అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. గ్రామ ప్రజలతో పాటు మహేశ్వరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉచితంగా అందిస్తున్న ఈ యొక్క వైద్య సేవలను నిపుణులైన హోమియో ఆయుర్వేద వైద్యులచే పరీక్షలు చేయించుకొని, అవసరమైన మందులను ఉచితంగా పొందవచ్చని గ్రామస్తులకు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరం ప్రతి శుక్రవారం విజయవంతముగా కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం వైద్య బృందం గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, సుమారు 125 మందికి బీపీ , షుగర్ , మోకాళ్ళ నొప్పులు, తిమ్మిర్లు, స్త్రీల సమస్యలు పిల్లల సమస్య లు మరియు జ్వరాలతో భాధప డుతున్న వారి సమస్యలు తెలుసుకొని వారికి అవసరమైన ఉచిత హోమియో ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమములో



గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, ఉప సర్పంచ్ శ్రీ జొరల రమేశ్, వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని,కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరిబాబు, సున్నం స్వప్నా, జటావత్ రుకేష్, రెవెళ్ళ చంద్రమౌళి, వైద్య బృందం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కోట మైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన కోసం అఖిలపక్ష

# సమావేశం ఏర్పాటు

## మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్



మహేశ్వరం, జులై 17,(ప్రజా కలం)

మహేశ్వరం నందు గడికోట ప్రాంగణములో వెలసిన కోట మైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన కొరకు గ్రామ పంచాయతీ కార్యాలయము నందు అఖిలపక్ష సమావేశం శుక్రవారం రోజున ఉదయం 10.30 గంటలకు మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ అధ్యక్షతన ఉప సర్పంచ్ జొరాల రమేశ్ వార్డు సభ్యులు మరియు వివిధ పార్టీల నాయకులు మరియు గ్రామ పెద్దలు ,గ్రామ ప్రజలతో మహేశ్వరం గ్రామ చారిత్రాత్మక గడికోట ప్రాంగణంలో స్వయంబుగా వెలసి గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా పూజలు అందుకుంటున్న శ్రీ కోట మైసమ్మ అమ్మవారి విగ్రహం కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో, అమ్మవారి విగ్రహాన్ని ఆగమశాస్త్ర నియమాల ప్రకారం పునఃప్రతిష్ఠించేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, దేవస్థాన కమిటీ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు,గ్రామ ప్రజలు పాల్గొని కోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని తేదీ :17-07-2026 నుండి తేదీ 19-07-2026 గ్రామస్థుల సహకారంతో ఘనంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఇట్టి సమావేశములో గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, కోట మైసమ్మ అమ్మవారు మహేశ్వరం గ్రామ ప్రజల ఆరాధ్య దైవమని, అమ్మవారి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచే విధంగా అందరి సహకారంతో నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా, పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతామని, ఇట్టి కార్యక్రమ విజయవంతానికి గ్రామ ప్రజలందరూ తమ వంతు సహాయ సహకారం అందించాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, ఉప సర్పంచ్ జొరల రమేశ్ ,వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరిబాబు, సున్నం స్వప్నా, జటావత్ రుకేష్, రెవెళ్ళ చంద్రమౌళి, శివ గంగా ఆలయ కమిటీ చైర్మెన్ అల్లే కుమార్ , మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం , మాజీ ఎంపిటిసి సభ్యుడు సుదర్శన్ యాదవ్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి ,నాయకులు కర్రోళ్ల చంద్రయ్య ,కాకి ఈశ్వర్ ముదిరాజ్ , సూర్య నారాయణ రెడ్డి ,నిమ్మగూడెం సుదీర్ గౌడ్ , కాడమోని ప్రభాకర్ ,ఆవులకాడి శ్రీశైలం ,సున్నం కృష్ణ ,మిద్దింటి యాదగిరి ,మిద్దింటి బల్రాజు , దానప్పగారి ఆగమయ్య ,దానప్పగారి నర్సింహా ,బహదూర్ గూడెం మహేందర్ , ఖానాపురం రవి ,వనపల్లి శ్రవణ్ ,ఆశనగారి నర్సింహా,పోల్కం కిస్టాయ్య ,మునవత్ పాండు , పెయ్యల దేవేందర్ ,పుట్లగారి చందు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుదారులకు అలర్ట్..

**జూలై 31లోపు ఈ-కేవైసీ తప్పనిసరి-**

**రాంసాగర్ డీలర్ ఎల్లం.**

దుబ్బాక ప్రజాకలం జూలై 17:

రేషన్ కార్డుదారులందరూ ఈ నెల 31లోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ



పూర్తి చేసుకోవాలని రాంసాగర్ డీలర్ ఎల్లం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పిడిఎస్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నిరంతరాయంగా ఆహార ధాన్యాల పంపిణీ కొనసాగించేందుకు ఈ ప్రక్రియను పూర్తి చేయడం అవసరమని పేర్కొన్నారు. కొన్ని రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల్లో ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేసి, మిగిలిన సభ్యులు పూర్తి చేయని పరిస్థితి ఉందన్నారు. ఇంకా ఈ-కేవైసీ చేయించుకోని రేషన్ కార్డుదారులందరూ తమ సమీప చౌకధరల దుకాణాన్ని సంప్రదించి వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# 11వ వార్డులో 'డ్రై డే--ఫ్రైడే' కార్యక్రమం

**వర్షాకాల వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు**

**వార్డు కౌన్సిలర్ కొలిచేలిమి భవాని**

గజ్వేల్ :17 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో శుక్రవారం 'డ్రై డే--ఫ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ కొలిచేలిమి భవాని వార్డులో పర్యటించి ప్రజలకు పారిశుధ్యం,దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని



సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు పాడైపోయిన డ్రమ్ములు, పాత సామాన్లు, టైర్లు, కూలర్లలో వర్షపు నీరు చేరకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మా పూర్ మాజీ సర్పంచ్ కొలిచేలిమి స్వామి,వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓఆర్ఆర్ సూరం గుట్ట ఆటో యూనియన్ నూతన కమిటీని ఎన్నిక

**అధ్యక్షులుగా రాతలవత్ బాలు నాయక్**

మహేశ్వరం, జులై 17,(ప్రజా కలం)

తుక్కుగూడ ఓఆర్ఆర్ సూరం గుట్ట ఆటో యూనియన్ (అనుబంధం ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జనరల్ బాడీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు రాతలవత్ బాలు, నాయక్.




ప్రధాన కార్యదర్శి. బోర్ర సురేష్. ఉపాధ్యక్షులుగా. పి తార్య. కోశాధికారి. ఎం సురేష్ నీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు దత్తు నాయక్, కొమగల రాజు దేవేంద్ర గౌడ్ లు జిల్లా నాయకులు పాల్గొని ఆటో యూనియన్ వాళ్లను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాములు నాయక్ .అంబ్యా. శంకర్ నాయక్. చంద్రు. చందన్. లాలు. వెంకటేష్. లచయ్య. సేవియా. శివ. శీను. మరియు తదితరులు పాల్గొన్నారు.

# బీఎంఎస్‌లో చేరిన పొట్టోళ్ల దాసు

**సీఐటీయూ కార్మిక సంఘానికి**

**రాజీనామా చేసి బీఎంఎస్‌లో చేరిక**

గజ్వేల్:17 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)లో పనిచేస్తున్న పొట్టోళ్ల దాసు ఆ సంఘానికి రాజీనామా చేసి, బీఎంఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మరాఠీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)లో చేరారు. ఈ సందర్భంగా మరాఠీ కృష్ణమూర్తి మాట్లాడుతూ,కార్మికుల హక్కుల పరిరక్షణకు బీఎంఎస్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని,వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. బీఎంఎస్ సిద్ధాంతాలు,కార్మిక సంక్షేమ కార్యక్రమాలపై విశ్వాసంతో పలువురు కార్మికులు సంఘంలో చేరుతున్నారని అన్నారు. పొట్టోళ్ల దాసు మాట్లాడుతూ,కార్మికుల సమస్యల పరిష్కారంలో బీఎంఎస్ సమర్థవంతంగా పనిచేస్తోందని, సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలు తనను ఆకట్టుకోవడంతో బీఎంఎస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు, కార్మికులు పాల్గొని పొట్టోళ్ల దాసును సంఘంలోకి ఆహ్వానించారు.



# సహజ వ్యవసాయంతో సాగు ఖర్చు తగ్గించి, అధిక లాభాలు పొందొచ్చు.

**ఏఎంసీ చైర్మన్ కనకయ్య.- గజ్వేల్ ఏడీఏ బాబునాయక్.**

దుబ్బాక ప్రజాకలం జూలై 17:

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామ రైతు వేదికలో శుక్రవారం ఎన్ఎంఎన్ఎఫ్ ఆధ్వర్యంలో సహజ వ్యవసాయం పై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎంసీ చైర్మన్ కనకయ్య, గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు బాబునాయక్ హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. సహజ వ్యవసాయం ద్వారా సాగు వ్యయాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు నేల సారాన్ని పెంపొందించి, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, స్థానికంగా లభించే వనరులతో పర్యావరణహిత వ్యవసాయం చేయడమే ప్రకృతి వ్యవసాయం ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సహజ వ్యవసాయ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సాగు ఖర్చు తగ్గడం, రసాయన ఎరువులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడం, నేల సారం మరియు నీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడడం, దీర్ఘకాలంలో స్థిరమైన దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు. అలాగే రసాయన అవశేషాలు తక్కువగా ఉన్న ఆరోగ్యకరమైన ఆహారం




అందుబాటులోకి రావడం, పర్యావరణ కాలుష్యం తగ్గడం, నేల, నీరు, గాలి నాణ్యత మెరుగుపడడం వంటి ప్రయోజనాలను రైతులకు వివరించారు. శిక్షణలో జీవామృతం, బీజామృతం, నిమాస్త్రం, అగ్నియాస్త్రం, బ్రహ్మాస్త్రం తయారీ విధానాలు, వాటి వినియోగం, సహజ వ్యవసాయంలో పాటించాల్సిన మెళకువలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. అనంతరం రైతుల సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, ఆరేపల్లి గ్రామ సర్పంచ్ దివ్య కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్లు మల్లేశం, యాదగిరి, ఆత్మ డైరెక్టర్ జానీ గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారి శిరీషతో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చెట్టును ఢీకొన్న కారు..

**డ్రైవర్‌కు స్వల్ప గాయాలు.**

దుబ్బాక ప్రజాకలం జూలై 17.

సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం చిన్నమాసన్‌పల్లి సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన



జనార్దన్ తన భార్యతో కలిసి హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి నుంచి కారులో స్వగ్రామమైన వీరారెడ్డి పల్లికి వస్తుండగా మార్గమధ్యంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న జనార్దన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రాయపోల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం అంబులెన్స్ ద్వారా క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

# తుక్కుగూడ లో ఆగస్టు 2న ఏఐటీయూసీ జిల్లా మహాసభలు

**- వలస కార్మికులు పారిశ్రామిక కార్మికులు సమస్యలపై ఉద్యమం చేపట్టాలి**

**- ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి చంద్రయ్య**

**- కేఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు**

మహేశ్వరం, జులై 17,(ప్రజా కలం)

వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్తులో ఉద్యమాలు నిర్వహించాలని ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి చంద్రయ్య పిలుపునిచ్చారు. తుక్కుగూడలో జరిగిన ఏఐటీయూసీ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ ఏఐటీయూసీ జిల్లా మహాసభలు ఆగస్టు 2న తుక్కుగూడలో జరగబోతున్న సందర్భంగా ఈ ప్రాంతంలో ఉన్న కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసే భవిష్యత్తు ఉద్యమాలు నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించాలని ఆయన జిల్లా నాయకత్వానికి సూచించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం




నాలుగు లేబర్ కోడ్ లు.తెచ్చి కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి దేశ కార్మిక వర్గం పోరాట సాధించుకున్న హక్కులను కాలరాసే కుట్రలు చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం తిరుగుబాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ ఆగస్టు 2న తుక్కుగూడలో జరిగే మహాసభలలో వలస కార్మికుల సమస్యల పైన పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎస్ఐ ఆసుపత్రిని ఈ ప్రాంతంలో నిర్మాణం చేయాలని స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని అనేక తీర్మానాలు ఆ మహాసభలలో చేయనున్నట్లు పర్వతాలు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి వహించగా ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బి.దత్తు నాయక్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మహాసభలో నిర్వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉన్నదని మండలంలోని ప్రజలు కార్మిక వర్గం సహకరించి ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి జిల్లా కార్యదర్శులు వనంపల్లి జైపాల్ రెడ్డి వడ్ల సత్యనారాయణ సక్రు నాయక్ మద్దిలేటి దేవేందర్ గౌడ్ కే రాజు రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆటో సంఘం నూతన నాయకత్వాన్ని పానుగంటి పర్వతాలు అభినందించే సన్మానం చేశారు.



## గడువు కు ముందే ఎస్ ఐఆర్ ప్రక్రియ ను పూర్తి చేయండి

**- డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి**

**-తమ కుటుంబ సభ్యుల ఎస్ ఐ ఆర్ ఫారాలను బిఎల్వో కు అందజేసిన నిర్మలా జగ్గారెడ్డి**

సంగారెడ్డి ప్రతినిధి జులై 17(ప్రజా కలం):

సంగారెడ్డి పట్టణం లోని రామ్ మందిర్ లో ఏర్పాటు చేసిన సర్ క్యాంప్ లో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి తమ కుటుంబ సభ్యుల వివరాలతో నింపిన సర్ ఫారాలను ఆమె బిఎల్వో కు అందజేశారు. జగ్గారెడ్డి తో పాటుగా కూతురు జయా రెడ్డి, కుమారుడు భరత్ సాయి రెడ్డి ల ఫారాలను



స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియ గడువు పొడిగించినప్పటికీ , తమ వివరాలను పొందుపరచడం లో, బి ఎల్ వో లకు ఫారాలు అందించడం లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లు చురుకుగా పనిచేస్తున్నారని, ఈపాటికే నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 60 శాతానికి పైగా ఓటర్ల నమోదు జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో బిఎల్ వో గంగరాజు, వార్డ్ ఆఫీసర్ లు శ్రావణి, శ్రీనివాస్, టీ పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కౌన్సిలర్ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు శివుడు తదితరులు పాల్గొన్నారు.

ఆపిల్ హెల్త్ ఫార్మసీ ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి పట్టణం లో ని విద్యుత్ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆపిల్ ఫార్మసీ నీ నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్ , మెడికల్ అససియేషన్ అధ్యక్షుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి ప్రాణాలను రక్షించుకోండి

**-విలేకరులకు హెల్మెట్ల పంపిణీ**

**-హోప్ న్యూరో డాక్టర్ కృష్ణమూర్తి**

ప్రజా కలం ప్రతినిధి జులై 17 మెదక్ జిల్లా మండల కేంద్రమైన రేగోడు లో పనిచేస్తున్న విలేకరులకు సంగారెడ్డి హోప్ న్యూరో ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ కృష్ణమూర్తి రేగోడు తహసిల్దార్ దత్తారెడ్డి ఎస్సై పోచయ్య



చేతుల మీదుగా శుక్రవారం పత్రిక విలేకరులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలు కావడంతో చాలామంది మరణించడం జరుగుతుందని ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలని చెప్పారు. హెల్మెట్ ప్రాణానికి రక్షణ గా ఉంటుందని తెలిపారు. రేగోడు తాసిల్దార్ దత్తారెడ్డి మాట్లాడుతూ హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీయమని ప్రతి ఒక్కరు సేవాదృపదంతో ముందుకు సాగాలని సమాజంలో విలేకరుల పాత్ర గొప్పదని చెప్పారు. ఎస్సై మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ పెట్టుకొని ప్రయాణించేటప్పుడు ప్రమాదం సంభవిస్తే తలకు గాయాలు కాకుండా ఉంటాయని పోలీసు వారి సూచనలు పాటించి వాహనాలు నడపాలని చెప్పారు. మాజీ సర్పంచ్ విజయభాస్కర్ మాట్లాడుతూ వైద్యుడు కృష్ణమూర్తి హెల్మెట్లను పంపిణీ చేయడం అభినందనీయమని వీరు సంగారెడ్డి జిల్లాలో రెండు వేలకు పైగా హెల్మెట్లను పంపిణీ చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో హోప్ న్యూరో యాజమాన్యం శ్రీనివాస్ నాయక్, పాండు,మండల పాత్రికేయులు విట్టల్ రావు సంతోష్. ప్రసాద్ . షాహిద్ అలీ సంతోష్ రావు ఉన్నారు.





## డాక్టర్స్ కాలనీలోని సమస్యలు తీరుస్తాం

**- నాగారం భూ సమస్యలపై అధికారులతో చర్చ**

**- సమస్యలు లేని నియోజకవర్గంగా మహేశ్వరం**

**- సీసీ రోడ్లు వేయించాలని అల్మాస్ గూడ, మీర్ పేట నాయకుల వినతి**

**-మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**

మహేశ్వరం, జులై 17, (ప్రజా కలం)

జిహెచ్ఎంసి లో విలీనమైన శివారు మున్సిపాలిటీల్లోని కాలనీలు, పల్లెల సమస్యలను తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం సిద్దంగా ఉందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ కార్యాలయంలో కెఎల్ఆర్ తో డాక్టర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకులు చెన్ రెడ్డి సురేష్ రెడ్డి భేటీ అయ్యారు. సరూర్ నగర్, డాక్టర్ కాలనీ డివిజన్లలో డ్రైనేజీ, సీసీ కెమెరాలు, తాగునీటి సమస్యలు, రోడ్ల మరమ్మత్తులు చేయించాలని కోరారు. భగత్ సింగ్ నగర్, అంబేద్కర్ నగర్ సహా పలువురు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వచ్చేలా చూడాలని కిచ్చెన్నగారికి విజ్ఞప్తి చేశారు.

మీర్ పేట, జిల్లెలగూడ, ప్రశాంతిహిల్స్ కాలనీల్లో సీసీ రోడ్లు లేక కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామిడి గోపాల్ రెడ్డి కెఎల్ఆర్ దృష్టికి తెచ్చారు. అల్మాస్ గూడ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై పలు కాలనీ అధ్యక్షులు, కమిటీ సభ్యులతో కలిసి హస్తం పార్టీ నేత నవారు మల్లారెడ్డి... కిచ్చెన్నగారిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్నా... కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలను గత పాలకులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న కాలనీల్లోని సమస్యలు తీర్చేందుకు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించాలని లక్ష్మారెడ్డి కోరారు. ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి సమస్యలు లేని కాలనీలుగా తీర్చేందుకు కృషి చేస్తానని కెఎల్ఆర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

## నర్సారెడ్డిపై దుష్ప్రచారం మానుకోవాలి

**సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొండల్ రెడ్డి**



గజ్వేల్:17 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై సోషల్ మీడియాలో జరుగుతున్న అనుచిత వ్యాఖ్యలు, దుష్ప్రచారాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొండల్ రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో పెరుగుతున్న నర్సారెడ్డి ఆదరణను చూసి ఓర్వలేక కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నర్సారెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీయడంతో పాటు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించాలనే కుట్రతో ఈ దుష్ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో నర్సారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని, పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తున్నాయని కొండల్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌లో చీలికలు తీసుకురావాలని ప్రయత్నిస్తున్న వారు తమ కుయుక్తులను వెంటనే విరమించుకోవాలని హెచ్చరించారు. నర్సారెడ్డిపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు, వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం నిధితో కొత్త ఆశ..

**-రూ.2.50 లక్షల సీఎం సహాయనిధి అందజేత..**

పటాన్‌చెరు, జులై 17 (ప్రజా కలం):

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని



పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. అమీన్పూర్ డివిజన్‌కు చెందిన కూరపాటి రేణుక అనారోగ్యంతో బాధపడుతుండగా, మెరుగైన చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేశారు. దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం రూ. 2 లక్షల 50 వేల విలువైన చికిత్స అనుమతి పత్రాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కూరపాటి రేణుక కుటుంబ సభ్యులకు చికిత్స అనుమతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్స అనుమతి పత్రాలు, ఆర్థిక సహాయ చెక్కులను పూర్తిస్థాయి పారదర్శకతతో అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలు ప్రభుత్వ ఈ సంక్షేమ అవకాశాన్ని వినియోగించుకొని మెరుగైన వైద్య చికిత్స పొందాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు..

## ఎస్ఐఆర్‌కు ఆదిత్యరెడ్డి దిశానిర్దేశం

**-ఎస్ఐఆర్ పరిశీలనలో ఆదిత్యరెడ్డి..**

**- వేగవంతం కానున్న ఓటరు నమోదు..**

పటాన్‌చెరు, జులై 17 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ యువజన ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలన నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని మున్నూరుకాపు ఫంక్షన్ హాల్‌తో పాటు జేపీ కాలనీ,శ్రీరాంనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, బూత్ స్థాయి అధికారుల పనితీరు,ఓటర్ల నమోదు,గణన ఫారాల సేకరణ పురోగతిని నేరుగా సమీక్షించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అర్హులైన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పంపిణీ చేసిన గణన ఫారాలను త్వరితగతిన తిరిగి సేకరించి, ఓటర్ల వివరాల డిజిటలీకరణను వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు మరింత వేగవంతం చేస్తామని ఆదిత్యరెడ్డి తెలిపారు. ఈ పరిశీలనలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, దేవన్న, రాజన్న, పాషా భాయ్, ఫయాజ్, విక్కీ పాల్గొన్నారు..





## బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

**-రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి.**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.**

**-మత్తడి పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు.**

వేములవాడ, జూలై 17 ( ప్రజా కలం ప్రతినిధి): బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం వేములవాడ పట్టణంలోని శ్రీ చెన్నకేశవ మత్తడి పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రభుత్వ విప్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించడమే కాకుండా సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భక్తులు అమ్మవారి ఆశీస్సులతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.

## కూరగాయల మార్కెట్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా

**శంషాబాద్ కూరగాయల మార్కెట్ నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షులుగా రమేష్ ముదిరాజ్**



శంషాబాద్, జులై 17,(ప్రజా కలం)

కూరగాయల మార్కెట్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని శంషాబాద్ కూరగాయల మార్కెట్ నూతన కమిటీ అధ్యక్షులు రమేష్ ముదిరాజ్ అన్నారు. శంషాబాద్ కూరగాయల మార్కెట్ నూతన కమిటీ అధ్యక్షులు రమేష్ ముదిరాజ్, ఉపఅధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్ (బన్నీ ), కార్యదర్శి లింగం, సహాయ కార్యదర్శి శ్రీనివాస్ చారి, కోశాధికారి మహేందర్ రెడ్డి, సలహాదారులు జితేందర్, యాదగిరి,నరేష్, మహేందర్,వెంకటేష్ రాజేందర్,వెంకట్ రెడ్డి, మోహన్ రెడ్డి సంఘ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ శంషాబాద్ కూరగాయల మార్కెట్ అభివృద్ధి కోసం తన వంతు కృషి నిరంతరం చేస్తానని అందరి సహకారం తీసుకుంటూ సలహాలు సూచనలను తీసుకుంటూ కూరగాయల మార్కెట్ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన అన్నారు.




# ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలే రక్షణ

**- హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి..ఎస్పీ మహేష్ బి. గితే.**

**-నాంపెల్లి--అనుపురం రహదారిపై చెట్లకు రేడియం స్టికర్లు ఏర్పాటు.**



వేములవాడ జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి) : రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేములవాడ పట్టణం నాంపెల్లిలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జనవరి నుంచి ప్రతి నెలా రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం, మైనర్లతో వాహనాలు నడిపించడం వల్లే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కూడా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం ప్రధాన కారణాలుగా గుర్తించామని చెప్పారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ పోలీసుల కోసం కాదని.. స్వీయ రక్షణతో పాటు కుటుంబ క్షేమం కోసం తప్పనిసరిగా ధరించాలని ఎస్పీ సూచించారు. వేములవాడకు వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రమాదంలో గాయపడిన వారిని గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల ప్రోత్సాహక నగదు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమం అనంతరం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. నాంపెల్లి నుంచి అనుపురం వరకు ప్రధాన రహదారి వెంబడి ఉన్న చెట్లకు రాత్రివేళ వాహనదారులకు మలుపులు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టికర్లను ఏర్పాటు చేశారు. అలాగే ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రబ్బర్ స్ట్రిప్స్, ఇసుక డ్రమ్‌లు, బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, ఎస్ఐలు రామ్మోహన్, వెంకటరాజం,శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు,పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వాహనదారులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి కలెక్టర్ ఆఫీస్ ముట్టడించిన సిఐటియూ కార్మికులు

**-కార్మిక శాఖ కార్మికుల పక్షాన ఉందా యాజమాన్యాల పక్షమా ఉందా -అరెస్టు చేసిన పోలీసులు**

**-కార్మికులకు న్యాయం కావాలంటే అరెస్టు చేస్తారా. - అరెస్ట్ లతో పోరాటం ఆగదు**

**-8 నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తుంటే యాజమాన్యంపై చర్య ఎందుకు లేదు**

**-కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు స్పష్టం - సిఐటియు జిల్లా కార్యదర్శి జి సాయిలు**






సంగారెడ్డి ప్రతినిధి జులై 17( ప్రజా కలం):

మైక్రో బాక్స్ కార్మికులకు న్యాయం చేయాలని అక్రమ తొలగింపులు ఆపాలని సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ముట్టడించడం జరిగింది ఈ సందర్భంగా జి సాయిలు మాట్లాడుతూ కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామ పరిధిలో గల మైక్రో బాక్స్ పరిశ్రమలో 13 మంది పర్మనెంట్ కార్మికులు 26 సంవత్సరాల నుండి పనిచేస్తుంటే యాజమాన్యం అక్రమంగా తొలగించి 8 నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా డ్యూటీ లోకి రాకుండా అడ్డుకుంటుందని అన్నారు పర్మనెంట్ కార్మికులు చేసే పని మీద కాంటాక్ట్ కార్మికులతో పని చేస్తూ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యం మీద చర్య తీసుకోవాలని డీసీఎల్ కు ఫిర్యాదు చేస్తే కన్సిలేషన్లో పెట్టి సమావేశం జరుగుతుంటే యాజమాన్యం కార్మికులను టర్మినేషన్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. కార్మిక చట్టాలను గౌరవించకుండా ఉల్లంఘిస్తున్న యాజమాన్యం మీద చర్య తీసుకోవాలని గత ఐదు రోజుల నుండి కలెక్టర్ ఆఫీస్ ముందు రిలే నిరాహార దీక్ష జరుగుతుంటే జిల్లా అధికారులు గానీ లేబర్ అధికారులు గాని పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు లేబర్ డిపార్ట్మెంట్ కార్మికుల పక్షమా యాజమాన్యాల పక్షమా అని ప్రశ్నించారు. 8 నెలల నుండి జీతాలు రాక డ్యూటీ లేక న్యాయం అడుగుతుంటే ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని లేకుంటే పోరాటం ఆగదని హెచ్చరించారు. అక్రమంగా తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఆఫీస్ వస్తే పోలీసులతో అరెస్టు చేయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు అరెస్టులతో ఉద్యమం ఆగదని న్యాయం జరిగే వరకూ పోరాడుతామని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి సాయిలు జిల్లా ఉపాధ్యక్షులు పి బాగా రెడ్డి, మాణిక్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సురేష్ శ్రీధర్ శివ పరమేశ్వర్ రమేష్ భీమ్ రెడ్డి షబ్బీర్ వీరేశం వెంకటేష్ శేఖర్ శ్రీనివాస్ రెడ్డి సాయన్న మురళి కార్మికులు పాల్గొన్నారు

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

**జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులకు స్పష్టం చేసిన మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**

కూకట్ పల్లి, జులై 17, ప్రజా కలం ప్రతినిధి:

మల్కాజ్గిరి మేడ్చల్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు మీడియా అక్రిడిటేషన్ కార్డు అందజేస్తామని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే - ఐజేయు) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రాం రెడ్డిలతో పాటు జిల్లా అక్రిడేషన్ కమిటీ ప్రతినిధులు శుక్రవారం జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు..

ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో జర్నలిస్టులుగా పని చేస్తున్న సీనియర్ రిపోర్టర్లందరికీ అక్రిడేషన్ కార్డులు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు జిల్లా టియుడబ్ల్యూజే ప్రతినిధులు మాట్లాడుతూ నిబంధనలు పేరుతో కొంతమందికి ఇబ్బంది కలిగించకుండా అందరికీ కార్డులు అందించే విధంగా చూడాలని కోరారు. అక్రిడేషన్ కార్డుల జారీలో జాప్యం చేయకుండా, అందరికీ అందజేయాలని, దీనికి అక్రిడేషన్ కమిటీ సహకారం అందజేస్తుందని తెలిపారు. కమిటీ ప్రతినిధుల వినతి మేరకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే జర్నలిస్టులందరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మల్కయ్య, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, అక్రిడేషన్ కమిటీ సభ్యులు రామారావు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రవి కిరణ్ రెడ్డి, టీయూడబ్ల్యూజే ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# హిమాయత్ సాగర్ లో గుర్తు తెలియని మగ వ్యక్తి శవం లభ్యం

**శవాన్ని ఉస్మానియా హాస్పిటల్ మార్చురీ కి తరలింపు**

**కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఆర్ జి ఐ ఏ పోలీసులు**

శంషాబాద్, జులై 17,(ప్రజా కలం)

శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటలకి ఒక డయల్ 100 కాల్ ద్వారా చెన్నమ్మ హోటల్ దగ్గర గల మస్జిద్ వెనుక వైపున హిమాయత్ సాగర్ లో ఒక శవం పడి ఉంది అని సమాచారం రాగా, వెంటనే అక్కడికి వెళ్ళి చూడగా ఒక ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి శవం వయసు అందజా 40-45 సం.రాలు నీళ్లలో వెల్లకిలా ఉంది. అట్టి శవం అంద్దాజ 7-10 పది రోజుల క్రితం చనిపోయినట్లుగా కనిపిస్తుంది. అట్టి వ్యక్తి చేపలు పట్టడానికి వచి ప్రమాదవశాత్తు నీళ్లలో పడి చనిపోయి ఉండచ్చు అని భావిస్తున్నాం.ఆ వ్యక్తి దగ్గర అతని ఆనవాలు నీ తెలిపే ఎటువంటి ఆధారం దొరకలేదు. అట్టి గుర్తు తెలియని వ్యక్తి బ్లాక్ కలర్ లోయర్, వైట్ అండ్ బ్లాక్ లైనింగ్ ఫుల్ టి షర్ట్ ధరించి ఉన్నాడు. అట్టి గుర్తు తెలియని శవాన్ని ఉస్మానియా హాస్పిటల్ మార్చురీ కి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాం అని పోలీసులు తెలిపారు. ఎవరైనా ఇట్టి శవాన్ని గుర్తుపడితే ఆర్ జి ఐ ఏ పోలీస్ స్టేషన్ లో సంప్రదించగలరు.



# ప్రగతి నగర్‌లో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం

## - నేడే దివ్య దర్శనం!

నిజాంపేట్, జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి)

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్‌లో శ్రీ జగన్నాథుని దివ్య రథయాత్ర మహోత్సవం ఈ శనివారం (జూలై 18న) అత్యంత వైభవంగా జరగనుంది. ప్రగతి నగర్ భక్తజన కోటికి జగన్నాథుని దివ్య అనుగ్రహం అందించేందుకు, జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ మహా ఘట్టానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.




నేడు సాయంత్రం 5:00 గంటల నుండి ఈ రథయాత్ర ప్రారంభం కానుంది. ప్రగతి నగర్ సాయి కృష్ణ కాలనీలోని "సాయి నిర్మాన్స్ గోకుల్ 2 అపార్ట్మెంట్స్" వద్ద రథయాత్ర ఘనంగా ప్రారంభమై.. ఎన్ఆర్ఐ కాలనీ, వాసవి కాలనీల మీదుగా సాగుతూ, వాసవి లేఅవుట్‌లోని హనుమాన్ దేవాలయం వద్ద ముగుస్తుంది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో రథయాత్రతో పాటు గీతాలాపన, నృత్య ప్రదర్శనలు, కోలాటం వంటి పలు వైవిధ్యభరితమైన సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు.

ఈ ఆధ్యాత్మిక వైభవంగా సాగే రథయాత్ర మహోత్సవంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కోలన్ హనుమంత రెడ్డి, నిజాంపేట్ మాజీ మేయర్ నీలా గోపాల్ రెడ్డి, నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోలన్ రాజశేఖర్ రెడ్డి తదితర ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులను కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

భగవన్నామ స్మరణతో, హరినామ సంకీర్తనలతో సాగే ఈ రథాన్ని లాగి, ఆ జగన్నాథుని దివ్య దర్శన భాగ్యాన్ని పొందాలని, భక్తులందరూ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విచ్చేసి ఈ ఆధ్యాత్మిక వేడుకను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ హృదయపూర్వక ఆహ్వానం పలికింది.



# జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలికి బీబీ పాటిల్ సన్మానం

మెదక్, జూలై 17 (ప్రజాకలం న్యూస్): భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన టేక్మాల్ గ్రామానికి చెందిన పట్లోళ్ల మల్లికా అశోక్‌ను మాజీ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ మహిళలు రాజకీయాలు, సామాజిక సేవా రంగాల్లో మరింత చురుకుగా పాల్గొని ప్రజలకు సేవ చేయాలని సూచించారు. పార్టీ బలోపేతంలో మహిళా మోర్చా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మహిళా నాయకత్వం ముందుండి పనిచేయాలని ఆకాంక్షించారు. పట్లోళ్ల మల్లికా అశోక్ మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. మహిళల అభ్యున్నతి, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తూ కార్యకర్తలతో సమన్వయంగా పనిచేస్తానని పేర్కొన్నారు.




# ఆటో భరత్‌కు బీజేపీ మద్దతు



## - చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జి బిజెపి అందెల శ్రీరాములు



హైదరాబాద్, జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి)

వనపర్తి జిల్లాకు చెందిన ఆటో డ్రైవర్ చంచరి భరత్ కుమార్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటన నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు ఆధ్వర్యంలో శుక్రవారం చార్మినార్‌లోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆటో భరత్ తన ఆటోపై రాసిన వ్యాఖ్యలతో కూడిన పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అందెల శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువులు, దేవాలయాలపై దాడుల ఘటనలు పెరుగుతున్నాయని ఆరోపించారు. ఆటో భరత్‌పై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛ ప్రతి పౌరుడికి సమానంగా వర్తిస్తుందని, హిందూ సమాజం తమ మత విశ్వాసాలను వ్యక్తీకరించే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హిందూ సమాజానికి సంబంధించిన అంశాల్లో భారతీయ జనతా పార్టీ అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ బీజేపీ నేత మహేందర్, రాష్ట్ర, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మహిళా మోర్చా, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దిల్‌సుఖ్‌నగర్‌లో మాంగళ్య మెగా ఎంట్రీ

## - దిల్‌సుఖ్‌నగర్‌లో మాంగళ్య షాపింగ్ మాల్ 32వ శాఖ ప్రారంభం
## - ముఖ్య అతిథిగా సినీ నటి మీనాక్షి చౌదరి..
## - కుటుంబ అవసరాలన్నింటికీ ఒకేచోట వస్త్రాల కలెక్షన్



హైదరాబాద్, దిల్‌సుఖ్‌నగర్ జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణలో వస్త్ర వ్యాపార రంగంలో తనదైన గుర్తింపు పొందిన మాంగళ్య షాపింగ్ మాల్ దిల్‌సుఖ్‌నగర్‌లో తన 32వ శాఖను ఘనంగా ప్రారంభించింది. సినీ నటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి అభిమానులతో ముచ్చటించారు. ఆమె రాకతో ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి సందడి చేశారు.

2012లో వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందిస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తరించింది. తాజాగా దిల్‌సుఖ్‌నగర్‌లో 32వ శాఖను ప్రారంభించి తన వ్యాపార విస్తరణను కొనసాగిస్తోంది.

ఈ సందర్భంగా నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. "దిల్‌సుఖ్‌నగర్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు విశేష ఆదరణ అందిస్తారని నమ్ముతున్నాను. వారి ఆశీస్సులతో ఈ శాఖ మరింత విజయవంతం కావాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహమూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరల్లో అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక ఫ్యాషన్‌కు అనుగుణంగా రూపొందిస్తూ వస్త్ర రంగంలో ముందంజలో కొనసాగుతున్నామని పేర్కొన్నారు. మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, చిన్నారుల కోసం తాజా ఫ్యాషన్ దుస్తులతో పాటు వివాహాలు, శుభకార్యాల కోసం ప్రత్యేక వెడ్డింగ్ కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రూ.99 నుంచి రూ.1 లక్ష వరకు వివిధ ధరల శ్రేణిలో వస్త్రాలు లభిస్తాయని, కుటుంబ సభ్యులందరికీ ఒకేచోట షాపింగ్ చేసే సౌకర్యం కల్పించామని వెల్లడించారు.

మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్ త్వరలో మరో 10 కొత్త శాఖలను ప్రారంభించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. అనంతరం తమిళనాడులో కూడా విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

# కోర్టుకు కవిత- సికింద్రాబాద్ కోర్టుకు హాజరైన కల్వకుంట్ల కవిత

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని
### కామారెడ్డిలో రైల్ రోకో
### రెండోసారి కోర్టుకు హాజరైన టీఆర్ఎస్ ఆదినేత్రి

హైదరాబాద్, జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్రంలో బీసీ వాదం బలంగా వినిపించిన టీఆర్ఎస్ ఛీఫ్ కవిత కోర్టు కేసు తప్పలేదు. అధిక జనాభా ఉన్న బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేసిన ఆమె కామారెడ్డిలో రైల్ రోకో నిర్వహించిన విషయం తెలిసిందే... ఈ కేసులో కవిత సికింద్రాబాద్ బోయిగూడలోని రెండవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఫర్ రైల్వేస్ (సికింద్రాబాద్ రైల్వే కోర్టు)కు హాజరయ్యారు..కేసు విచారణలో భాగంగా కోర్టుకు వచ్చినట్లు అమె వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటికే ఒక సారి కోర్టుకు హాజరయ్యారు. ఇది రెండోసారి. కాగా వారి హాజరును నమోదు చేసుకున్న న్యాయస్థానం కేసు తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ కేసులో కవితతో పాటు పలువురు నాయకులు కోర్టుకు హాజయ్యారు...



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

## పంట పొలాలకు విద్యుత్ సమయాన్ని పెంచాలి

సి.బెళగల్ : రైతులకు వ్యవసాయ అవసరాల కోసం ప్రస్తుతం అందిస్తున్న 9 గంటల విద్యుత్ సరఫరా సమయాన్ని పెంచడంతో పాటు, కేటాయించిన సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ అందించాలని కోరుతూ సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, కమ్మదహాల్ గ్రామాల రైతులు మండల విద్యుత్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడి జాన్సన్, ఏఈ సుకుమారును కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగారైతులు మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం, కాలువల ద్వారా సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం బోరు బావులపైనే పూర్తిగా ఆధారపడాల్సి వస్తోందని, అయితే విద్యుత్ సరఫరా మధ్య మధ్యలో నిలిచిపోవడం వల్ల మోటార్లు సక్రమంగా నడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పంటలకు సకాలంలో నీరు అందక రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కనీసం ప్రస్తుతం కేటాయించిన 9 గంటల విద్యుత్‌ను కూడా అంతరాయం లేకుండా నిరంతరంగా అందించాలని, సాధ్యమైనంత వరకు విద్యుత్ సరఫరా సమయాన్ని మరింత పెంచాలని అధికారులను కోరారు. రైతుల సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు మారందొడ్డి టీడీపీ నాయకుడు జిక్రియ భాష, కమ్మదహాల్‌కు చెందిన భాస్కర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రాణాపాయంలో ఉన్న వ్యక్తిని కాపాడిన మాజీ కౌన్సిలర్ సురేంద్ర

నందికొట్కూర్ : బ్రాహ్మణకొట్టుకూరు-బొల్లవరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని నందికొట్కూరు మాజీ కౌన్సిలర్ సురేంద్ర అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. కర్నూలు నుంచి మిడ్తూరుకు బైక్‌పై ప్రయాణిస్తున్న డాక్టర్ ఫారుక్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై రక్తస్రావంతో అక్కడే పడి ఉన్నారు. వెనుకనే కారులో వస్తున్న మాజీ కౌన్సిలర్ సురేంద్ర ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. గాయపడిన డాక్టర్ ఫారుక్ ను స్వయంగా ఎత్తుకుని తన కారులో ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. సమయానికి వైద్యం అందడంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా నివారించగలిగారు. ఈ విషయం తెలుసుకున్న బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని సురేంద్ర చేసిన సేవాభావాన్ని కొనియాడారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో సహాయం చేసి ప్రాణరక్షకుడిగా నిలిచిన సురేంద్రపై స్థానికులు ప్రశంసల వర్షం కురిపించారు.

## బొప్పాయి అమ్మకాలలో దళారి వ్యవస్థను రద్దు చేయాలి

చిట్వేలి : బొప్పాయి అధికంగా పండించే రైల్వే కోడూరు నియోజకవర్గంలో బొప్పాయి అమ్మకాలలో దళారీ వ్యవస్థను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత కోరారు. చిట్వేలి మండలం చెర్లోపల్లి లో బొప్పాయి, మామిడి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కష్టనష్టాలకు ఓర్చి బొప్పాయి పంటను పండిస్తున్నారని అన్నారు. నకిలీ విత్తనాలతో దళారీలు రైతులను బోల్తా కొట్టించి వారి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. ఢిల్లీ, ముంబాయి, ఇతర ప్రాంతాల నుండి వచ్చే బొప్పాయి వ్యాపారులను నేరుగా రైతుల వద్దకు వెళ్లనీయకుండా కోడూరు లోనే వారికి సకల సదుపాయాలు దళారీలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నేరుగా దళారీలే తమకు నచ్చిన రేటుకు బొప్పాయిని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. నకిలీ విత్తనాలతో సగం బొప్పాయి చెట్లు కాయకపోవడంతో దిగుబడి రాకపోవడంతో రైతులు సాగు కోసం పెట్టిన ఖర్చుల కోసం నానా అగచాట్లు పడుతున్నారని తెలిపారు. వారం క్రితం కిలో 25 రూపాయలు అమ్మిన బొప్పాయి ప్రస్తుతం దళారీలు రూ.18 కి తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యులు పందికాళ్ళ మణి పాల్గొన్నారు.

## హిందూ విద్యార్థి తో కల్మా చదవాలని ఒత్తిడి ..

### - సైదాబాద్లో ఉద్రిక్తత

హైదరాబాద్: పాతబస్తీ పరిధిలోని సైదాబాద్లో ఉన్న సక్సెస్ స్కూల్లో 2వ తరగతి చదువుతున్న ఓ హిందూ విద్యార్థితో కల్మా చదవాలని పాఠశాల యాజమాన్యం ఆదేశించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. తమ పిల్లల మత విశ్వాసాలకు విరుద్ధంగా ఎలాంటి ప్రార్థనలు లేదా మతపరమైన పాఠాలు బలవంతంగా చెప్పించడం సరైంది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని సిబ్బంది తీరు పట్ల విద్యార్థి కన్నీరు పెడుతు ఇంటికి రావడంతో తల్లితండ్రులు గమనించి అడగగా అసలు విషయం వెలుగులోకి రావడం జరిగింది.. ఈ ఘటనపై సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, ఆరోపణలు నిజమైతే పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు. హిందూ సంఘాలు స్కూలు ముందు అందోళన చెపట్టాయి. స్కూలు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేసాయి. పరిస్థితులు ఉద్రిక్తతంగా మారడంతో పోలీసులు అందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

## యువకుడి దారుణ హత్య

పిఠాపురం : పిఠాపురం నియోజకవర్గం మూలపేట గ్రామంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అమ్మమ్మ అంత్యక్రియలకు వచ్చిన పెదపూడి మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన రాకేష్ (28) హత్యకు గురైయాడు. ఒక దుకాణం వద్ద రాకేష్ చెల్లితో కొందరు యువకులు అసభ్యకరంగా ప్రవర్తించడంతో వివాదం తలెత్తింది. తన చెల్లిని ఎందుకు కామెంట్ చేశారని రాకేష్ నిలదీయడంతో సదరు యువకులతో ఘర్షణ కు దిగారు. అమ్మమ్మ ఖననం కోసం స్మశాన వాటికకు వెళ్లిన రాకేష్పై వంశీ అనే యువకుడు, మరో నలుగురు చాకుతో దాడికి దిగారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రాకేష్ను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఆసుపత్రికి తరలించే లోపే రాకేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువకుడి దారుణ హత్యతో పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## చెరువును కబళిస్తున్న మట్టి మాఫియా...

తూర్పు గోదావరి జిల్లా : ప్రభుత్వ ఆస్తిపై కన్నేసిన మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నిబంధనలను బేఖాతరు చేసి కొత్తపల్లి గ్రామం చివర ఉన్న ప్రభుత్వ చెరువులో యథేచ్ఛగా ఏఅఃలతో మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యాలు స్థానికుల కెమెరాకు చిక్కాయి. గత కొన్ని రోజులుగా తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో ఏఅః, ట్రాక్టర్లతో వచ్చి చెరువు మట్టిని తవ్వి ట్రాలీలకు ఎక్కించి తరలిస్తున్నారు. ఫోటోల్లో కనిపిస్తున్నట్లుగా యంత్రాలతో పెద్ద పెద్ద గుంతలు తీసి మట్టిని అమ్ముకుంటున్నారు. పర్యావరణానికి, రైతాంగానికి పెను ప్రమాదంచెరువు మట్టిని ఇష్టానుసారం తవ్వేయడంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా దెబ్బతింటుంది. దీనివల్ల రాబోయే వర్షాకాలంలో కొత్తపల్లి, చుట్టుపక్కల గ్రామాల్లోని వేలాది ఎకరాల ఆయకట్టుకు నీరు అందకుండా పోయే ప్రమాదం ఉంది. అంతేకాదు, భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సమస్య కూడా తలెత్తనుంది."చెరువే మా ప్రాణం. దాన్ని నాశనం చేస్తే మా బతుకులు ఏమైపోవాలి? ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. రాజకీయ నాయకుల అండతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయి సమాచారంఅధికారుల నిర్లక్ష్యమే కారణమామట్టి అక్రమ తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. గోకవరం రెవెన్యూ, మైన్స్, ఇరిగేషన్ శాఖ అధికారుల అలసత్వం వల్లే ఇలాంటి అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపయోగిస్తున్న ఏఅః, వాహనాలను సీజ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# వివక్షతోనే ఈశ్వరమ్మ యాదవ్ పై దాడి

## శశివచరణ్ రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలి :ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

### కాంగ్రెస్ మహిళా,బహుజన వ్యతిరేక పార్టీ

### సీఎం రేవంత్, పీసీసీ మహేష్ కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్




హైదరాబాద్, జూలై 17 (ప్రజా కలం ప్రతినిధి)

మహిళా, బహుజన వ్యతిరేక పార్టీ కాంగ్రెస్ పార్టీ పక్కా అని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. యాదాద్రి ఆలయ కమిటీ బోర్డు మెంబర్, సీనియర్ నాయకురాలు ఈశ్వరమ్మ యాదవ్ పై జరిగిన వివక్షాపూరిత దాడిని ఆయన ఖండించారు. శుక్రవారం ఎల్‌బీ నగర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...40 ఏళ్లుగా రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ, ఎల్‌బీ నగర్‌లో కౌన్సిలర్‌గా గెలిచిన ఈశ్వరమ్మను మహిళ అని కూడా చూడ కుండా అవమానిస్తూ దాడి చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. యూత్ కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్ జక్కిడి శివచరణ్ రెడ్డి స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి భాషలోనే మాట్లాడుతూ ఈశ్వరమ్మ పై వివక్షాపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు.

**బాధితురాలికి భయం.. నిందితుడికి గన్ మెన్లా?**

దాడికి గురైన 80 ఏళ్ల బాధితురాలు ఈశ్వరమ్మ రక్షణ లేక ఇంట్లో భయం భయంగా గడుపుతుంటే, దాడి చేసిన నిందితుడు శివచరణ్ రెడ్డికి ప్రభుత్వం వెంటనే 1o1 గన్ మెన్ సెక్యూరిటీని కేటాయించి తిప్పడం సిగ్గుచేటని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఏ హోదా లేని శివచరణ్‌కు ఏ ప్రాతిపదికన సెక్యూరిటీ ఇచ్చారని ప్రశ్నించారు. బీసీలను, పేద వర్గాలను ఏం చేసినా నడుస్తుందనే అహంకారంతో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని మండిపడ్డారు. ఈశ్వరమ్మ ఘటనపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని పశ్నించారు..

**బీసీ నాయకుడు లేని కమిటీ..డ్రామాలు..**

ఈ దాడి సంఘటన పై దర్యాప్తు చేయడానికి బీసీ నాయకుడు లేని కమిటీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. కేవలం జగ్గారెడ్డి, నరసింహా రెడ్డిలతో కమిటీ వేసి డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. సదరు కమిటీ సభ్యులు బాధితురాలిని కలిసి అడిగిందేమీ లేదని, అసలు నిందితుడైన శివచరణ్ రెడ్డికి నోటీసులు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో షబ్బీర్ అలీకి వెంటనే షోకాజ్ నోటీసు ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వం, ఈ విషయంలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు జరిగే న్యాయం ఇదేనా అని కాంగ్రెస్ అధిష్టానంను నిలదీశారు..

**కాంగ్రెస్ పాలనలో చులకన....**

కాంగ్రెస్ పాలనలో మహిళల పట్ల చులకన భావం పెరిగిపోయిందని, రాష్ట్రంలో వారి పై దాడులు జరుగుతున్నాయని ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. షాబాద్‌లో ఆరుగురు మహిళలు హత్యకు గురైనా, పోక్సో కేసుల్లో నిందితులకు బెయిల్ ఇప్పిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే బెల్లి లలిత లాంటి బహుజన మహిళలు హత్యకు గురయ్యారని గుర్తుచేశారు. బీసీలకు ముందు పదవులు ఇచ్చి, వెనుక నుండి అణిచివేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. శివచరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి వెంటనే సస్పెండ్ చేయాలని, యాదాద్రి ఆలయ కమిటీ బోర్డు మెంబర్ హోదాలో ఉన్న ఈశ్వరమ్మ యాదవ్‌కు తక్షణమే గన్ మెన్ సెక్యూరిటీ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.





# రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

## -యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి కలెక్టరేట్ జులై 17 ప్రజాకలం:ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున వరి సాగును పరిమితం చేసి ప్రత్యామ్నాయ పంటల సాగు పై దృష్టి సారించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మిని మీటింగ్ హాలులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి మండల స్పెషల్ అధికారులతో,మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులతో ప్రత్యామ్నాయ పంటలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. వానాకాలం 2026లో ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయిన నేపథ్యంలో వ్యవసాయ సాగులో ప్రయోజనకర పద్ధతులను, పంట మార్పిడి విధానాలను రైతులకు వివరించి లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాల్లో సాగవుతున్న పంటలపై మండలాల వారీగా రివ్యూ నిర్వహించారు. జిల్లాలో 50 శాతం వరకు వేరే పంటలు సాగు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మూసి పరివాహక ప్రాంతం ఎక్కువగా ఉండి అక్కడ వరి పంట కాకుండా వేరే పంటలు వేసే విధముగా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. హైద్రాబాద్ కి సరిహద్దులో ఉన్న మండలాలు మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయి కాబట్టి కూరగాయలు,ఆకుకూరలు, పండ్లు,తదితర పంటలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ పంటలు 5 వేల ఎకరాలకు టార్గెట్ పెట్టాలని సంబంధిత అధికారులు సూచించారు. ఏఈఓలు అందరు రైతు వేదికలల్లో రైతులకు ఎల్ ని నో ఎఫెక్ట్ పై అవగాహన కలిపించాలన్నారు, డ్రిప్ ఇరిగేషన్ పంటలు వేసేలా చూడాలని,వానాకాలం సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని,అవి రైతులకు అందజేయాలన్నారు.రైతులకు జిల్లాల వారీగా విత్తనాల నిల్వలు,పంపిణీపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు వరి వేయకుండా కూరగాయలు, పండ్ల పంటలు,ఆయిల్ ఫామ్, తదితర పంటలను రైతులు సాగు చేసుకునేలా మండల వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. లాభాదాయకం పంటలు సాగు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మార్చి నెల నుంచి ఇప్పటి వరకు జిల్లాలో తక్కువ వర్షపాతం మాత్రమే నమోదైనందున, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు తమ బోరు బావుల్లో అందుబాటులో ఉన్న నీటి సామర్థ్యాన్ని అంచనా వేసుకుని,అధిక నీరు అవసరమయ్యే పంటల విస్తీర్ణాన్ని తగ్గించి,కొద్ది రోజుల్లోనే కోతకు వచ్చే స్వల్పకాలిక కూరగాయల పంటలను సాగు చేయడం ఉత్తమమని సూచించారు. రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేసి రైతులు విత్తనాలు సద్వినియోగం చేసుకొని అదనపు ఆదాయం పొందే విధంగా కూరగాయల సాగును చేపట్టాలని కోరారు. రుతు పవనాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితుల్లో టమాటా,వంకాయ,మిరప,బెండ,మునగ,చిక్కుడు,గోరు చిక్కుడు,పాలకూర, సొరకాయ,కాకరకాయ,బీరకాయ,దోసకాయ వంటి పంటలకు అనువైన స్వల్పకాలిక, కరువును తట్టుకునే రకాలను సాగు చేయాలని తెలిపారు. ముఖ్యంగా టమాటా,వంకాయ పంటల్లో అంటుకట్టిన నారుమొక్కలను వినియోగించడం,విడతల వారీగా నర్సరీలను ఏర్పాటు చేయడం ద్వారా తేమ ఒత్తిడిని తగ్గించి మెరుగైన దిగుబడులు సాధించవచ్చున్నారు. అలాగే గట్లు--కాలువల పద్ధతి,ఎత్తైన మడులపై సాగు,బిందు సేద్యం,మైక్రో స్ప్రింక్లర్ విధానాలను అవలంబించడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చున్నారు. శాస్త్రీయ సూచనల మేరకు వినియోగించడం ద్వారా పంటల దిగుబడి,నాణ్యత మెరుగుపడుతుందని వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు సంప్రదాయ సాగు విధానాలకు బదులుగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని, నీటిని ప్రతి చుక్కను పొదుపుగా వినియోగిస్తూ తక్కువ వ్యవధిలో అధిక ఆదాయం అందించే కూరగాయల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ శాస్త్రీయ సలహాలను పాటిస్తే వర్షాభావ పరిస్థితుల్లో కూడా మెరుగైన దిగుబడులు సాధించి ఆర్థికంగా లాభపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు విధులలో అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమీక్షలో డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక,జడ్పీ సీఈవో శోభారాణి, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి,వ్యవసాయ శాఖ అధికారి వెంకటరమణ,ఉద్యానవన శాఖ అధికారి,సంబంధిత శాఖల అధికారులు,మండల స్పెషల్ అధికారులు,మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

